ANN తెలుగు

Follow: @ANNTELUGU

12-05-2026

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 135 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



# స్టాలిన్‌తో విజయ్ భేటీ

### తమిళనాట ఆసక్తికర పరిణామాలు

### రాజకీయ ప్రత్యర్థుల ఇంటికి సీఎం

### ఆకట్టుకుంటున్న విజయ్ ఆత్మీయత

**చెన్నై, మహా:** తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. రాజకీయ ప్రత్యర్థుల ఇంటికి వెళ్ళి సహకారం కోరడం ద్వారా తమిళనాడులో సరికొత్త రాజకీయాన్ని పరిచయం చేస్తున్నారు. ముఖ్యమంత్రి, ప్రత్యర్థి పార్టీ నేతలు ఒకరిపై ఒకరు కారాలు, మిరియాలు నూరుకోవడం, కక్ష పూరిత నిర్ణయాలు తీసుకోవడం సహజంగా అన్ని చోట్ల జరుగుతూ ఉంటుంది. కానీ తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మాత్రం కాస్త భిన్నంగా వ్యవహరించారు. మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జకీయంగా భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ప్రజాహిత అంశాల్లో కలిసి పనిచేయాలని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డట్టు తెలుస్తోంది. డీఎంకే నిర్మాణాత్మక సూచనలు చేయాలని విజయ్ కోరినట్టు సమాచారం. విజయ్ ను స్టాలిన్ తనయుడు ఉదయనిధి సాదరంగా ఇంట్లోకి ఆహ్వానించారు. శాలువాతో స్టాలిన్ విజయ్ ను సత్కరించారు. విజయ్ స్టాలిన్ ను సత్కరించారు. వైగో ఇంటికి కూడా విజయ్ వెళ్ళగా, ఆత్మీయంగా స్వాగతించారు. ఈ వీడియో వైరల్ గా మారింది.

## టాప్ న్యూస్



**బండి సంజయ్ నిస్పాక్షిక విచారణ కోరాలి**
- విచారణకు అడ్డుపడద్దు
- ఆడబిడ్డలకు అన్యాయం సహించం
- మంత్రి పొన్నం ప్రభాకర్

03



**బండి సంజయ్ కొడుకుపై పోక్సో కేసు**
- బీజేపీకి ఏం సంబంధమన్న రాంచందర్ రావు
- చట్టం తన పని తాను చేసుకుంటుందని వెల్లడి
- మోదీ సభ విజయవంతంపై హర్షం

03



**కేంద్ర హోంమంత్రి కొడుకు పారిపోవడం దేశంలో ఇదే తొలిసారా?**
- కేటీఆర్ ట్వీట్

02



### తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి

సభ్యులుగా శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ.. చాకలి ఐలమ్మ మనుమరాలు శ్వేత

**హైదరాబాద్, మహా:** రాష్ట్ర మహిళా కమిషన్‌ను అధికారికంగా పూర్తి స్థాయిలో పునరుద్ధరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అత్యంత కీలకమైన మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని ప్రభుత్వం నియమించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఈ కమిషన్‌కు పూర్తిస్థాయి పాలకమండలిని ప్రకటించింది.

మిగతా 2లో

### బెంగాల్ సర్కార్ సంచలనం

- 45 రోజుల్లో బీఎస్ఎఫ్‌కు సరిహద్దు భూముల కేటాయింపు
- అంతర్జాతీయ సరిహద్దులో కంచె నిర్మాణానికి సహకారం



**కోల్ కత, మహా:** పశ్చిమ బెంగాల్ రాష్ట్ర పరిపాలనలో నూతన శకం ప్రారంభమైంది. కొత్తగా కొలువుదీరిన సర్కారు తన తొలి కేబినెట్ సమావేశంలోనే పరిపాలనాపరమైన, భద్రతాపరమైన పెను మార్పులకు శ్రీకారం చుడుతూ సంచలన నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర ప్రభుత్వంతో గతంలో ఉన్న ప్రతిష్టంభనకు పూర్తిగా తెరదించుతూ, రాష్ట్ర సమగ్రాభివృద్ధి, జాతీయ భద్రత, ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా మంత్రివర్గం ఏకంగా ఆరు కీలక తీర్మానాలకు ఆమోదముద్ర వేసింది.

మిగతా 3లో



### అధికారం శాశ్వతం కాదు

హామీలు గాలికొదిలేసి ప్రధానిపై విమర్శలా?

బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ధ్వజం

మిగతా 2లో

# రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో కలిసి నడుస్తాం

## ట్రిపుల్ ఆర్‌కు యాభై శాతం నిధులు కోరాం

బ్రిటీష్ జనతాపార్టీగా బీజేపీ.. విభజించడమే వారి సిద్ధాంతం

బంగారం కొనొద్దనడం కేంద్ర వైఫల్యమే

తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తాం

మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి చిట్ చాట్

హైదరాబాద్, మహా : రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం తప్పనిసరి అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ హక్కుల కోసం తాము కేంద్రంతో పోరాడుతామని వ్యాఖ్యానించారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ చిట్ చాట్‌లో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ విధానాలు, రాష్ట్ర అభివృద్ధి, మావోయిస్టుల సరెండర్‌లు, మహిళా రిజర్వేషన్లు, రీజినల్ రింగ్ రోడ్, బండి భగీరథ్ కేసు వంటి అనేక కీలక అంశాలపై స్పందించారు.

**ప్రధాని మోదీతో అభివృద్ధి అంశాలపైనే చర్చ..**

హెచ్ఐసీసీలో తాను ప్రస్తావించిన అభివృద్ధి అంశాలను ప్రధాని మోదీ అంగీకరించారని సీఎం తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర సహకారం అవసరమని, అదే విషయాన్ని మోదీ దృష్టికి తాను తీసుకెళ్లానని చెప్పుకొచ్చారు. 'నేను బీజేపీని ఓడించిన ముఖ్యమంత్రిని... కానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిందే' అని వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం కేంద్రాన్ని నిధులు అడగలేదని, తాము మాత్రం తెలంగాణ హక్కుల కోసం అడుగుతున్నామని పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ప్రధాని మోదీ సమావేశం కావడం ప్రైవేట్ కార్యక్రమమని చెప్పుకొచ్చారు.

**కేంద్రం నిధులు ఇవ్వాలి..**

రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టుకు కేంద్రప్రభుత్వం 50 శాతం నిధులు ఇవ్వాలని కోరామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మెట్రో, సదరన్ పార్ట్ రీజినల్ రింగ్ రోడ్ వంటి కొన్ని ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఎయిర్‌పోర్ట్ క్లియరెన్స్ లు, డిఫెన్స్ ల్యాండ్స్, మూసీ ప్రాజెక్టుకు ఏడీబీ నిధులు, నేషనల్ హైవేలకు అనుమతులు వచ్చినట్లు వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ పనులు ఆలస్యమయ్యాయని ఆరోపించారు. 2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని తాను ప్రధాని మోదీని కోరగా ఆయన అంగీకరించారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కేంద్ర సహకారం అవసరమని తెలిపారు.

మిగతా 2లో



### విదేశీ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలం..

బీజేపీని 'బ్రిటిష్ జనతా పార్టీ'గా సీఎం రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. విభజించి పాలించడం ఆ పార్టీ సిద్ధాంతమని ఆరోపించారు. ముస్లింలు, క్రిస్టియన్లు, మావోయిస్టులు కూడా ఈ దేశ ప్రజలేనని, అందరికీ సమాన హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. బీజేపీ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఖతం చేయడం వాళ్ల విధానమని విమర్శించారు. తమ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఒప్పించి జనజీవనంలో కలపడం కాంగ్రెస్ విధానమని వ్యాఖ్యానించారు. విదేశీ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. కేంద్రానికి స్పష్టమైన విధానం లేదన్నారు. జెమిని సర్కస్ లా బీజేపీ ఎన్నికల విధానం ఉంటుందని ఎద్దేవా చేశారు. అనుభవరాహిత్యం, అహంకారం వల్లనే దేశాన్నిసంక్షోభంలోకి నెడుతున్నారని ఆరోపించారు.

# మహా కథనంతో కదిలిన యంత్రాంగం

## కొండాపూర్ అక్రమ కట్టడాలపై అధికారుల కొరడా

కళ్లు తెరిచిన రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాలు.. తక్షణ చర్యలకు రంగం సిద్ధం

రూ. 10 కోట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణ,

7 అంతస్తుల నిర్మాణ బాగోతంపై 'మహా పత్రిక' సంచలన కథనం

అక్రమార్కుల గుండెల్లో గుబులు..

వంతపాడిన అధికారుల పైనా వేటుకు కసరత్తు


బరితెగించిన అక్రమార్కులు

కొండాపూర్ సర్వే నెంబర్ 59 గల్లంతు
- ఆరు వందల గజాల ప్రభుత్వ స్థలం ఆక్రమణ
- విలువ రు 10 కోట్ల పై మాటే.. నకిలీ పత్రాలతో అనుమతులు
- రెండు నిర్మాణాలకు స్టిల్ట్ ప్లస్ మూడు ఫ్లోర్లకు పర్మిషన్లు
- నిర్మించేది మాత్రం ఏడు ఫ్లోర్లు ఆపైన పెంట్ హౌస్ నిర్మాణాలు
- సర్వే నెంబర్ 60 లో జీహెచ్ఎంసీ అనుమతులు పొంది, సర్వే నెంబర్ 59 లో గల ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు
- టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే అక్రమ నిర్మాణాలు
- సిఎంసి కమీషనర్ స్పందించాలంటున్న స్థానికులు

రాజధాని నడిబొడ్డు.. సైబరాబాద్ కార్పోరేషన్ పరిధిలోని కొండాపూర్ లో అక్రమార్కులు బరితెగించారు.. ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు పక్కా స్కెచ్ వేసి దురాక్రమణకు తెగబడుతున్నారు... నకిలీ పత్రాలు సృష్టించి జిహెచ్ ఎంసి నుండి అనుమతులు పొంది నిర్మాణాలు సాగించటం ఇక్కడ పరిపాటిగా మారింది.. ఆరు వందల గజాల ప్రభుత్వ భూమి విలువ బహిరంగ మార్కెట్లో రు 10 కోట్ల పైమాటే ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.. ప్రభుత్వ భూమి కబ్జా కు గురైందని రెవె న్యూ అధికారులకు పిర్యాదు చేసిన కబ్జా దారులతో కుమ్మక్కయ్యారని ఎటువంటి చర్యలు తీసుకోలేదని బహిరంగ ఆరోపణలు వ్యక్త మౌతున్నాయి.. అనుమతులు మించి నిర్మాణాలు సాగిస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

ప్రత్యేక ప్రతినిధి, మహా : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శేరిలింగం పల్లి మండలం, కూకట్పల్లి జోనల్, మాదాపూర్ సర్కిల్ పరిధి కొండాపూ... భూకబ్జా దారులు పెట్రేగిపోతున్నారు. సర్వే ... స్తుల నిర్మాణాలు చేపడుతుంటే ఎందుకు అడ్డుకోరని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొండాపూర్ ప్రధాన ... అధికారులు మాది కాదంటే.. మాది కాదంటూ.. ఒకరిపై ఒకరు నెపం వేసుకొని ప్రజలను తప్పుదా... లాది రూపాయలు ప్రభుత్వ ఖజానకు చేరకుండా పక్కా దారి పడుతున్నాయి... ఇదిలా ఉంటే నిర్మాణాలు పూర్తి కాకుండానే ఓ.సి లు జారీ చేయటం ద్వారా రు 70లక్షలు రూపాయలు చేతులు మారినట్లు స్థా...

**మహా ఎఫెక్ట్**

**ప్రత్యేక ప్రతినిధి, మహా:**

పత్రికా దర్పణం పదునైనదైతే.. ఎంతటి అవినీతి కోటలైనా బీటలు వారాల్సిందే. సామాన్యుడి గొంతుకగా మారి, అక్రమార్కుల బండారాన్ని నిర్భయంగా బయటపెడితే ప్రభుత్వ యంత్రాంగం ఏ విధంగా పరుగులు పెడుతుందో చెప్పడానికి ఈ పరిణామమే సజీవ సాక్ష్యం. ఐటీ కారిడార్ గుండెకాయ లాంటి కొండాపూర్‌లో ఏకంగా రూ. 10 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబళించి, నిబంధనలకు పాతరేసి ఏడు అంతస్తుల భవనాలు నిర్మిస్తున్న భూబకాసురుల వ్యవహారాన్ని 'మహా పత్రిక' అత్యంత సాహసోపేతంగా వెలుగులోకి తెచ్చింది. ఈ సంచలన కథనంతో ఎట్టకేలకు అధికార యంత్రాంగంలో చలనం వచ్చింది. గాఢ నిద్రలో ఉన్న రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు ఉలిక్కిపడి లేచారు. అక్రమ నిర్మాణాలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని, బేషరతుగా ప్రభుత్వ భూమిని కాపాడతామని ఉన్నతాధికారులు ప్రకటించారు. కొండాపూర్ ప్రధాన రహదారి పక్కన ఉన్న వోక్స్ వ్యాగన్, కియా కార్ల షోరూమ్‌ల వెనుక వైపు సుమారు ఆరు వందల చదరపు గజాల అత్యంత విలువైన ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతమైంది. ప్లాట్ నెంబర్ 13సి తదితర స్థలాల్లో సర్వే నంబర్లు మార్చేసి, టౌన్ ప్లానింగ్ అధికారులతో కుమ్మక్కై కొందరు అక్రమార్కులు బహుళఅంతస్తుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. జీహెచ్‌ఎంసీ రికార్డుల ప్రకారం కేవలం స్టిల్ట్ ప్లస్ మూడు అంతస్తులకు మాత్రమే


మిగతా 2లో

### తెలంగాణ విద్యావిధానంపై నీతి ఆయోగ్ ప్రశంసలు

- రాష్ట్రంలో 11 వేల టీచర్ పోస్టులు భర్తీచేశాం
- 36 వేల మంది టీచర్లను బదిలీచేశాం
- విద్యకు కేటాయింపులు మరింతగా పెంచుతాం
- టెన్ ప్లస్ టూ విద్యావిధానం తీసుకొస్తాం
- విద్యావారోత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి

02





# ఎవరి ఒత్తిళ్లకూ భారత్ తలొగ్గదు

## విధ్వంసకారుల దాడులను తట్టుకుని నిలబడ్డ సోమనాథ్

సోమనాథ్ ఆలయ 75వ పునర్నిర్మాణ వేడుకల్లో ప్రధాని మోదీ

రూ. 75 స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్ విడుదల..రోడ్‌షోకు బ్రహ్మరథం

**సోమనాథ్ (గుజరాత్),మహా:** పవిత్ర ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం సోమనాథ్ మహాదేవ్ ఆలయం వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత దేశ సత్తాను, పరాక్రమాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పారు. ప్రపంచంలో ఏ దేశం ఒత్తిళ్లకు, ఆంక్షలకు తలొగ్గే ప్రసక్తే లేదని భారత్ ఏనాడో నిరూపించిందని ఆయన ఉద్ఘాటించారు. సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఘనంగా

మిగతా 2లో

# బండి భగీరథ్‌పై పోక్సో కేసు

## రంగంలోకి సిట్ అధికారిణి

మూడు రోజులుగా భగీరథ్ ఫోన్ స్విచాఫ్..

సీఎం ఆదేశాలతో సిట్ ఏర్పాటు చేసిన డీసీపీ



**హైదరాబాద్, మహా:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు విచారణ వేగవంతమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కేసుపై సోమవారం డీజీపీ సీవీఆనంద్ తో మాట్లాడి విచారణ వేగవంతం చేయాలని ఆదేశించగా, విచారణ అధికారిగా మహిళా ఐపీఎస్‌ను నియమించారు. సోమవారం విచారణాధికారిణి, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ గైక్వాడ్ పేట్ బషీరాబాద్ పి.ఎస్.కు చేరుకొని కేసు పురోగతిని సమీక్షించారు. నిందితులు ఎవరైనా చట్టపరమైన చర్యలు తప్పవని, త్వరలోనే బాధితురాలి వాంగ్మూలం నమోదు చేస్తామని ఆమె స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాటైన ఈ సిట్ (SIT) బృందం రోజువారీ నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పించనుంది. కాగా బండి సంజయ్ కొడుకు బండి భగీరథ్ ఫోన్ మూడు రోజులుగా స్విచ్ ఆఫ్ ఉందని, నిందితుడు పరారీలో ఉన్నాడని, అతని సీడీఆర్ పరిశీలిస్తున్నామని,, ఆచూకీ కోసం గాలిస్తున్నామని విచారణాధికారి తెలిపారు. బాధితురాలి స్టేట్మెంట్ రికార్డ్ చేసామని, మరిన్ని వివరాల కోసం ఇంకోసారి స్టేట్మెంట్ రికార్డ్ చేయాల్సి వస్తుందని కేసు విచారణాధికారి రితిరాజ్ తెలిపారు.

# రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో కలిసి నడుస్తాం

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి విషయంలో కలిసి పనిచేద్దామని ప్రధాని చెప్పారని.. తమ మధ్య జరిగిన చర్చ పూర్తిగా అభివృద్ధికి సంబంధించినదేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

**ఎస్ఐఆర్‌ను బీజేపీ ఆయుధంగా ఉపయోగిస్తోంది..**

ఎస్ఐఆర్‌ను బీజేపీ ఆయుధంగా ఉపయోగిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. పశ్చిమబెంగాల్‌లో 90 లక్షల ఓట్లను తొలగించారని ఆరోపించారు. కేరళంలో 3 సీట్లు, తమిళనాడులో ఒక సీటు మాత్రమే బీజేపీ గెలుచుకుందని ప్రస్తావించారు. ఏ రాష్ట్రంలో గెలవాలంటే అక్కడ ఎస్ఐఆర్‌ను ప్రయోగిస్తున్నారని ఫైర్ అయ్యారు. జూబ్లీహిల్స్‌లో బీజేపీకి డిపాజిట్ రాలేదని.. మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ పరిస్థితి ఏమిటని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ రెండు సీట్లతో ప్రారంభమైందని..అక్కడికే వస్తుందని విమర్శించారు. కాంగ్రెస్‌ను మోదీ విమర్శిస్తే తనను విమర్శించినట్లేనని అన్నారు. కేంద్రం నుంచి తెలంగాణకు ఆశించిన మేరకు సహకారం లేదని చెప్పారు. బీజేపీకి ప్రజాస్వామ్యంపైన నమ్మకం లేదని మండిపడ్డారు. తమిళనాడులో అతిపెద్ద పార్టీకి ప్రభుత్వ ఏర్పాటు కోసం గవర్నర్ ఆహ్వానించకుండా నిర్లక్ష్యం ఎందుకు చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ జపం చేయకుండా బీజేపీ బతకదని విమర్శించారు.

**మావోయిస్టుల లొంగుబాటుకు ప్రత్యేక చర్యలు..**

తెలంగాణలో 818 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారని, దేశంలో ఎక్కడా ఇలాంటి పరిస్థితి లేదని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. బుల్లెట్ కాదు బ్యాలెట్ అని కాంగ్రెస్ ఎప్పటి నుంచో చెబుతోందని, చివరకు మావోయిస్టులు కూడా అదే మార్గంలోకి వచ్చారని అన్నారు. మావోయిస్టుల లొంగుబాటుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని చెప్పారు. గణపతి వంటి నేతలు కూడా జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. అవసరమైతే వైద్య సహాయం, ఆర్థిక సాయం కూడా అందిస్తామని తెలిపారు. దేశం కోసం కాంగ్రెస్ ప్రాణాలు ఇచ్చిందని ఉద్ఘాటించారు. రాజీవ్ గాంధీని చంపిన వాళ్లకు కూడా సోనియా గాంధీ క్షమాభిక్ష పెట్టారని ప్రస్తావించారు.

**ప్రధాని మోదీ వ్యాఖ్యలు దురదృష్టకరం..**

ప్రధాని మోదీ మాట్లాడిన కొన్ని మాటలు దురదృష్టకరమని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ముస్లింలు, క్రిస్టియన్లు, ఇతర మతాలు, కులాలు, మావోయిస్టులు దేశ ప్రజలు కారా.. అందరికీ సమాన హక్కులు ఉన్నాయని తెలిపారు. బీజేపీ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వాళ్లను ఖతం చేయడమే వాళ్ల విధానమని మండిపడ్డారు. తమ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వాళ్లను ఒప్పించి జనజీవనంలో కలపడం తమ విధానమని ఉద్ఘాటించారు. మనుషులను చంపడం పరిష్కారం కాదని.. ముస్లింలు, మావోయిస్టులు కూడా ఈ దేశ భాగస్వాములేనని అన్నారు. దేశంలో ఐక్యత పెంచేలా ప్రధాని మాట్లాడాలని, విడదీసేలా వ్యాఖ్యలు చేయడం మంచిది కాదని చెప్పారు. ఇది బీజేపీ వివక్ష రాజకీయాలకు నిదర్శనమని ఆరోపించారు.

**బంగారం కొనొద్దని చెప్పడం కేంద్ర వైఫల్యమే**

బంగారం కొనొద్దు, విమానాల్లో ప్రయాణం చేయొద్దని ప్రజలకు చెప్పడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. విదేశాంగ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రతిపక్షాల సూచనలు తీసుకోవాలని, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని కేంద్రానికి సూచించారు. మోదీ అనుభవరాహిత్యం, అహంకారం వల్ల దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌ను దేనికి సంబంధం లేకుండా అమలు చేయడానికి అవకాశం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళా రిజర్వేషన్లు అమలు చేయొచ్చని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన 543 లోక్‌సభ సీట్లను దామాషా ప్రకారం చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. 50 శాతం పెంపు అనే దానికి కూడా ఎలాంటి ఫార్ములా లేదని చెప్పుకొచ్చారు. సీట్ల పెంపకంపైనే అందరికీ అభ్యంతరాలు ఉన్నాయని అన్నారు. జమిలి ఎన్నికలు 2029లో జరిగే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు.

**బండి భగీరథ్ కేసుపై సిట్**

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన కేసు విషయంపై కూడా సీఎం స్పందించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మే 8వ తేదీన ఎఫ్ఐఆర్ నమోదైందని, ప్రధాని మోదీ పర్యటన భద్రతా ఏర్పాట్ల కారణంగా విచారణ ఆలస్యమైందని వివరించారు. ఇప్పుడు దర్యాప్తు వేగవంతం చేశామని, సిట్ ఏర్పాటు చేశామని.. సీనియర్ మహిళా అధికారిని విచారణాధికారిగా నియమించినట్లు చెప్పారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని.. ఎవరినీ ఇప్పటివరకు వదలిపెట్టలేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

**ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై విమర్శలు..**

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై కూడా సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు చేశారు. గతంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఫిర్యాదు చేసిన ఆయనే తర్వాత ప్రభాకర్ రావును నీతిమంతుడని చెప్పారని గుర్తుచేశారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ దగ్గర ఆధారాలు ఉంటే పోలీస్ కమిషనర్‌కు ఇవ్వొచ్చని.. మైక్‌ల ముందు స్టేట్‌మెంట్లు ఇవ్వడం వల్ల విచారణ జరగదన్నారు. కేటీఆర్ బామ్మర్ది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ తీసుకుని దొరికినా తాము వదల్లేదని తెలిపారు. ఖాళీగా ఉన్నామని కేటీఆర్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పోలీసుల డ్యూటీ చేస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. గడీలు బద్దలు కొడతానని గతంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చెప్పారని ప్రస్తావించారు.

**తడిసిన ధాన్యం కూడా కొనుగోలు**

అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అయినప్పటికీ తడిసిన ధాన్యాన్ని కూడా తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని చెప్పారు. పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించేందుకు విస్తృత చర్చలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు వివరణ ఇచ్చే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. యూరియా కేంద్రం ఇవ్వాలని.. రాష్ట్ర ప్రభుత్వం పంచాలని తెలిపారు.

**తుమ్మిడిహట్టి అంశంపై కేంద్రానికి లేఖ..**

తుమ్మిడిహట్టి ప్రాజెక్టు అంశంపై ఇప్పటికే మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మహారాష్ట్ర సీఎం స్పందించేలా చూడాలని ప్రధాని మోదీకి కూడా లేఖ పంపినట్లు చెప్పారు. రెండు రాష్ట్రాల మధ్య సమస్యలు వచ్చినప్పుడు ప్రధాని పెద్దరికం వహిస్తే మంచిదని వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ద్వారా కూడా చర్చలు జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

## ఎవరి ఒత్తిళ్లకూ
# భారత్ తలొగ్గదు

### విధ్వంసకారుల దాడులను తట్టుకుని నిలబడ్డ సోమనాథ్

సోమనాథ్ ఆలయ 75వ పునర్నిర్మాణ వేడుకల్లో ప్రధాని మోదీ

రూ. 75 స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్ విడుదల..రోడ్‌షోకు బ్రహ్మరథం



(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించిన 'అమృత్ మహోత్సవం'లో ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ వేడుకల వేదికగా 75 ఏళ్ల పునర్నిర్మాణానికి గుర్తుగా రూ. 75 స్మారక నాణేన్ని, ప్రత్యేక పోస్టల్ స్టాంపును ప్రధాని ఆవిష్కరించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల అనంతరం సద్భావన మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.సరిగ్గా ఇదే రోజు (మే 11) 1998లో అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలో పోఖ్రాన్‌లో అణు పరీక్షలు నిర్వహించి భారత్ సత్తా ఏమిటో ప్రపంచాన్ని విస్మయానికి గురిచేశామని మోదీ గుర్తుచేశారు. ఆ తర్వాత మే 13న మరో రెండు అణుపరీక్షలు చేశామని తెలిపారు. ఆ సమయంలో అగ్రరాజ్యాలు మనపై ఎన్నో ఆంక్షలు విధించి ఇబ్బందులకు గురిచేసినా, మనం ఏమాత్రం భయపడలేదని, ఎవరికీ తలొగ్గకుండా అత్యంత ధైర్యంగా నిలబడ్డామని ప్రధాని స్పష్టం చేశారు. మన వేలాది ఏళ్ల ఆధ్యాత్మిక చైతన్యానికి సోమనాథ్ ఆలయమే సజీవ సాక్ష్యమన్నారు. చరిత్రలో గజనీ, ఖిల్జీ లాంటి విధ్వంసకారులు ఈ ఆలయ సంపదను ఎన్నోసార్లు దోచుకున్నారని, ఎన్నెన్ని దాడులు చేసినా ఈ దేవాలయం నేడు సగర్వంగా నిలబడిందని మోదీ కొనియాడారు. భారతీయ ఆధ్యాత్మిక శక్తి గురించి ఆ విధ్వంసకారులకు తెలియదని, అసత్యంపై ఎప్పటికైనా సత్యానిదే విజయమని మన పూర్వీకులు నిరూపించారని ఆయన ఉద్ఘాటించారు. 1951లో ఆలయ పునర్నిర్మాణం చేపట్టామని, పవిత్ర సోమనాథ్ దేవాలయ రూపురేఖలను నేడు పూర్తిగా మారుస్తున్నామని, ఆలయ అభివృద్ధికి సాక్షాత్తు పరమశివుడి ఆశీస్సులు ఉన్నాయని ప్రధాని పేర్కొన్నారు. ప్రాచీన సంస్కృతిని, వారసత్వాన్ని కూడా భారత్ సగర్వంగా పరిరక్షించుకుంటుందనడానికి ఈ పునర్నిర్మాణ పనులే నిదర్శనమన్నారు.ఆధ్యాత్మికతకు, ఆధునిక శాస్త్ర సాంకేతికతకు ఉన్న అనుబంధాన్ని ప్రధాని ఈ సందర్భంగా ఆసక్తికరంగా వివరించారు. జాబిల్లిపైకి విజయవంతంగా పంపిన 'చంద్రయాన్' ప్రాజెక్టులో మన రోవర్ దిగిన ప్రాంతానికి 'శివశక్తి పాయింట్' అని నామకరణం చేశామని ఆయన గుర్తుచేశారు. పరమశివుడికి, చంద్రుడికి మధ్య ఉన్న అవినాభావ సంబంధానికి ప్రతీకగానే ఆ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. అంతకుముందు ప్రధాని మోదీ సోమనాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరమేశ్వరునికి మహా పూజ, అభిషేకం, ధ్వజ పూజల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అనంతరం ఆలయ పునర్నిర్మాణానికి ఆద్యుడైన 'ఉక్కు మనిషి' సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన కుంభాభిషేక క్రతువులోనూ పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా భారతీయ వాయుసేనకు చెందిన 'సూర్యకిరణ్' బృందం ఆకాశంలో చేసిన సాహసోపేత విన్యాసాలు చూపరులను అబ్బురపరిచాయి. ఈ వేడుకల్లో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘ్వీ తదితరులు పాల్గొన్నారు. ప్రధాని మోదీ రాక సందర్భంగా సోమనాథ్ పురవీధులు జనసంద్రంగా మారాయి. హెలిప్యాడ్ నుంచి వీర్ హమీర్జీ సర్కిల్ వరకు సుమారు కిలోమీటరున్నర మేర సాగిన ప్రధాని రోడ్‌షో అత్యంత అట్టహాసంగా సాగింది. దారిపొడవునా జాతీయ జెండాలు చేతబూనిన వేలాది మంది ప్రజలు 'మోదీ' నామస్మరణతో ఘన స్వాగతం పలికారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు భారతీయ సంస్కృతి ప్రతిబింబించేలా చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా బెంగాల్ జానపద కళాకారుల సంప్రదాయ నృత్యాలు ఈ రోడ్‌షోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 1951లో భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఈ పునర్నిర్మిత ఆలయాన్ని ప్రారంభించగా, ఆ చారిత్రక ఘట్టానికి 75 వసంతాలు పూర్తయిన నేపథ్యంలో ప్రభుత్వ, పీఠం ఆధ్వర్యంలో ఈ అమృత్ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.



## మహా కథనంతో
# కదిలిన యంత్రాంగం

(మొదటిపేజీ తరువాయి)

అనుమతులు తీసుకున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం నిబంధనలకు నీళ్లు వదిలి ఏకంగా ఏడు అంతస్తులతో పాటు పెంట్ హౌస్ నిర్మాణాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. నిర్మాణాలు పూర్తి కాకుండానే సుమారు రూ. 70 లక్షలు చేతులు మారడం ద్వారా అడ్డదారిలో ఓసీ (ఆక్యుపెన్సీ సర్టిఫికెట్) కూడా పొందారన్న నగ్న సత్యాన్ని స్థానికుల ఆధారాలతో సహా 'మహా పత్రిక' కళ్లకు కట్టింది. వాస్తవానికి ఈ ప్రాంతం జోన్ల విభజనకు ముందు శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిల్ పరిధిలో ఉండగా భవన నిర్మాణ అనుమతులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఇది కూకట్పల్లి జోనల్ పరిధిలోని మాదాపూర్ సర్కిల్‌లో కలిసింది. ఇదే అదనుగా భావించిన కింది స్థాయి అధికారులు.. ఇది మా పరిధి కాదంటే మాది కాదంటూ ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ నెలల తరబడి ప్రజలను తప్పుదోవ పట్టించారు. అధికారుల అండదండలతోనే ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన లక్షలాది రూపాయల ఆదాయం పక్కదారి పడుతోందని, కళ్లెదుటే ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతోందని స్థానికులు మొత్తుకున్నా ఏ ఒక్కరూ పట్టించుకోలేదు.

**మహాపత్రిక అక్షరశరం.. అధికారుల అలర్ట్**

ఎప్పుడైతే ఈ మొత్తం భూకబ్జా, అక్రమ నిర్మాణాల వ్యవహారంపై 'మహా పత్రిక' ధైర్యంగా అక్షర శరం సంధించిందో.. పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కథనం ప్రచురితమైన వెంటనే జీహెచ్ఎంసీ కమిషనర్ స్థాయి అధికారులు అప్రమత్తమయ్యారు. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాల ఉన్నతాధికారులు హుటాహుటిన స్పందించి అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించేందుకు సిద్ధమయ్యారు. నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన ఆకాశహర్మ్యాలను సీజ్ చేయడానికి, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి రంగం సిద్ధం చేశారు. అంతేకాకుండా, కాసులకు కక్కుర్తి పడి ఈ అక్రమాలకు వంతపాడిన అవినీతి అధికారులపైనా కఠినమైన శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించినట్లు సమాచారం. ఈ పరిణామంతో కొండాపూర్‌లోని భూకబ్జాదారుల్లో తీవ్ర వణుకు మొదలైంది. సామాన్యుడి పక్షాన నిలిచి ఆక్రమణదారుల గుట్టు రట్టు చేయడంతో పాటు, ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు 'మహా పత్రిక' చూపిన చొరవ పట్ల స్థానిక ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అధికారం శాశ్వతం కాదు

### హామీలు గాలికొదిలేసి ప్రధానిపై విమర్శలా?
### బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ ధ్వజం

**హైదరాబాద్, మహా :** ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ పరిస్థితులు, ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో దేశ ప్రజల శ్రేయస్సు కోసమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలోచిస్తున్నారని, ఆయన మార్గదర్శకత్వంలోనే తాము నడుచుకుంటామని మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, గ్యాస్ ధరలు మండిపోతున్నాయని, అగ్రరాజ్యమైన అమెరికాలో సైతం ధరల సెగ కనిపిస్తోందని వారు గుర్తుచేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో దేశ ఆర్థిక మూలాలు దెబ్బతినకుండా ఉండేందుకే.. స్వదేశీ ఉత్పత్తులను ఎక్కువగా వాడాలని, విదేశీ మారక ద్రవ్యం వృథా కాకుండా చూడాలని ప్రధాని మోదీ దేశ ప్రజలను కోరారని తెలిపారు. దేశ ప్రధాని స్వయంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారంటే పరిస్థితి ఎంత గంభీరంగా ఉందో ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. ఆయన పిలుపును ప్రజలంతా అందిపుచ్చుకుని దేశ స్వావలంబన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే 'మేక్ ఇన్ ఇండియా', 'మేడ్ ఇన్ ఇండియా' కోసం మోదీ అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. తమ పార్టీలో సమర్థులైన నాయకత్వానికి ఏమాత్రం కొదవలేదని ఈ సందర్భంగా వారు ఉద్ఘాటించారు. ఇదే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం,



అధికార పక్ష నేతల తీరుపై వారు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధానమంత్రి రాష్ట్రానికి వచ్చినప్పుడు నిధులు ఇవ్వాలని కోరడం, ఆయన వెళ్లగానే ఏమీ ఇవ్వలేదంటూ రాజకీయ విమర్శలు చేయడం ఇక్కడి నాయకులకు పరిపాటిగా మారిందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలపై విమర్శలు చేసే ముందు గత పాలకుల చరిత్రను గుర్తుచేసుకోవాలని హితవు పలికారు. . రాజకీయ నాయకులు తమ మాటలను జాగ్రత్తగా అదుపులో ఉంచుకుని మాట్లాడాలని, ప్రజాస్వామయంలో ఎవరూ శాశ్వతంగా అధికారంలో ఉండరని, కుర్చీలు వస్తుంటాయి.. పోతుంటాయన్న సత్యాన్ని గుర్తెరిగి ప్రవర్తించాలని వారు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

### కేంద్రహోంమంత్రి కొడుకు పారిపోవడం
# దేశంలో ఇదే తొలిసారా?

**కేటీఆర్ ట్వీట్**



**హైదరాబాద్, మహా:** దేశ చరిత్రలో కేంద్ర హోంమంత్రి కొడుకు పరారీలో ఉన్నాడని చెప్పడం ఇదే తొలిసారా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ ద్వారా ప్రశ్నించారు. విచారణ అధికారి స్టేట్ మెంట్ నేపథ్యంలో భేటీ బచావో అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి

సభ్యులుగా శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ.. చాకలి ఐలమ్మ మనుమరాలు శ్వేత

చైర్‌పర్సన్‌తో పాటు మరో ఆరుగురు మహిళా నేతలను కమిషన్ సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. సభ్యులుగా శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ.. చాకలి ఐలమ్మ మనుమరాలు శ్వేత లను నియమించడం ఆసక్తికరంగా మారింది. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్సీ అందినట్లే ప్రచారం జరిగి చేజారగా, సీఎం రేవంత్ రెడ్డి ఆమెను మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమించారు. కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత, శశికళ, సదా లక్ష్మి, రాధ, మరియు షకీరాలను కమిషన్ ప్యానెల్ సభ్యులుగా ఎంపిక చేశారు.. విభిన్న సామాజిక వర్గాలు, నేపథ్యాల నుంచి వచ్చిన ఈ ఆరుగురు సభ్యులతో కూడిన కొత్త కమిషన్.. అణగారిన, బాధితులైన మహిళలకు అండగా నిలవడంలో ఒక పటిష్టమైన బృందంగా పనిచేయనుంది.


# తెలంగాణ విద్యావిధానంపై నీతి ఆయోగ్ ప్రశంసలు

### రాష్ట్రంలో 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం.. 36 వేల మంది టీచర్లను బదిలీ చేశాం

### విద్యకు కేటాయింపులు మరింతగా పెంచుతాం.. టెన్ ప్లస్ టూ విద్యావిధానం తీసుకొస్తాం.. విద్యావారోత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి






**హైదరాబాద్, మహా:** విద్యా రంగంలోనూ తెలంగాణ ప్రాంతం దశాబ్దాలుగా వివక్షకు గురైందని, ఉత్తమ విద్యా ద్వారానే మంచి సమాజాన్ని నిర్మించుకోగలుగుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వివక్ష వల్లే 1969లో తెలంగాణ ఉద్యమం ప్రారంభమైందని, అప్పటి నుంచి దశాబ్దాల పాటు పోరాడి తెలంగాణ సాధించుకున్నామని గుర్తు చేశారు. వర్సిటీలు నిర్లక్ష్యానికి గురైతే మన విద్యా వ్యవస్థ ప్రమాణాలు పడిపోతాయని గ్రహించామన్నారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి విద్యా వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 11 వేల టీచర్ల పోస్టులను భర్తీ చేసిందన్న సీఎం 60 రోజుల్లోనే పరీక్షలు నిర్వహించి, నియామకపత్రాలు అందించామని తెలిపారు. 20 ఏళ్లపాటు ప్రభుత్వ టీచర్లకు పదోన్నతులు ఉండలేదని ఆరోపించారు. వివాదాలకు తావులేకుండా 36 వేల మంది టీచర్లను బదిలీ చేశామని అన్నారు. 4 అంశాల్లో తెలంగాణను నీతిఆయోగ్ అభినందించిందని గుర్తు చేశారు. 27 వేల పాఠశాలల్లో 19 లక్షల మంది పేద విద్యార్థులు చదువుతున్నారని. రాష్ట్రంలో విద్యార్థులు, టీచర్ నిష్పత్తి 17:1 గా ఉందని అన్నారు.

**పది తర్వాత డ్రాప్‌అవుట్లు**

ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఉన్న లోపాలను మనం అధిగమించాలని సీఎం తెలిపారు. ఫలితాల్లో ప్రైవేటుతో పోలిస్తే ఎందుకు వెనకబడి ఉన్నామో ఆలోచించాలని కోరారు. కమిషన్ సిఫార్సుల ప్రకారం విద్యాశాఖకు నిధులు 15శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారు. విదేశాల్లో విద్యా విధానంపై అధ్యయనం చేయాలని టీచర్లను పంపిస్తున్నామని, ఇప్పటికే కొంతమంది టీచర్లు ఫిన్లాండ్‌లో అధ్యయనం చేసి వచ్చారని పేర్కొన్నారు. విద్యతో పాటు పిల్లలను సాంకేతిక నైపుణ్యాలు, క్రీడల్లో తీర్చిదిద్దాలని, విద్యారంగంలో ఎన్నో మార్పులు వచ్చాయని వెల్లడించారు. మనం మాత్రం ఇంకా కాలం చెల్లిన సిలబస్‌నే కొనసాగిస్తున్నామని, టెన్ ప్లస్ టూ విధానం లేకపోవటం వల్ల పది తర్వాత డ్రాప్‌అవుట్లు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

**కులవివక్షను రూపుమాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బలవర్ధకమైన పోషకాహారం పెట్టాలని నిర్ణయించామని, మధ్యాహ్న భోజనంతో పాటు బ్రేక్‌ఫాస్ట్ పథకం పెట్టాలని నిర్ణయించామని, బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కొన్ని స్కూళ్లల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టామని రేవంత్ రెడ్డి తెలిపారు. 16 ఏళ్లుగా హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు పెంచకపోతే ఈ ప్రభుత్వం పెంచిందని, 10 ఏళ్ల తర్వాత ఈ ప్రభుత్వమే విద్యార్థులకు డైట్ ఛార్జీలు పెంచిందని గుర్తు చేశారు. ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు అంటూ కులానికొక రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేశారని, వేర్వేరు రెసిడెన్షియల్స్ వల్ల కులవివక్ష పెరుగుతుందని తాము గ్రహించామని తెలిపారు. కులవివక్షను రూపుమాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టామని, ప్రభుత్వ పాఠశాలలు దేశ భవిష్యత్‌ను నిర్మించే వేదికలుగా మారాలని కోరారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఒక్కో సమస్యను క్రమంగా పరిష్కరిస్తామని, ఒక టీచర్ సరిగా పనిచేయకపోతే విద్యార్థి జీవితంతో పాటు సమాజం చెడిపోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు కేకే, ఎమ్మెల్సీ కోదండరాం, విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ, వర్సిటీల వీసీలు హాజరయ్యారు.

## బెంగాల్ సర్కార్ సంచలనం

(మొదటిపేజీ తరువాయి)

దశాబ్దాలుగా నలుగుతున్న పలు కీలక సమస్యలకు తక్షణ పరిష్కారాలు చూపేలా ఈ కేబినెట్ భేటీ సాగడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.దేశ భద్రతకు అత్యంత కీలకమైన సరిహద్దుల రక్షణ విషయంలో బెంగాల్ ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుంది. బంగ్లాదేశ్‌తో ఉన్న అంతర్జాతీయ సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి అవసరమైన భూమిని కేవలం 45 రోజుల్లోగా బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)కు కేటాయించాలని మంత్రివర్గం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీనికి తోడు, దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన నూతన క్రిమినల్ చట్టం 'భారతీయ న్యాయ సంహిత' (బీఎన్ఎస్)ను బెంగాల్‌లో తక్షణమే అమలు చేయాలని కేబినెట్ తీర్మానించింది. అంతేకాకుండా, గత ప్రభుత్వ హయాంలో రాజకీయ కారణాలతో నిలిచిపోయిన అన్ని కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇకపై రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి ఆంక్షలు లేకుండా పూర్తి స్థాయిలో అమలు చేయాలని నిర్ణయించడం సామాన్య ప్రజలకు పెద్ద ఊరటనిచ్చింది. అలాగే, రాష్ట్రానికి చెందిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కేంద్ర సర్వీసుల శిక్షణకు పంపేందుకు గతంలో ఉన్న అడ్డంకులను పక్కన పెడుతూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. పరిపాలనాపరమైన నిర్ణయాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ బాధితులను ఉద్దేశించి కేబినెట్ కీలక ప్రకటనలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు భారీ ఊరటనిస్తూ, వారి ఉద్యోగ కాలాన్ని ఏకంగా మరో ఐదేళ్ల పాటు పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయం సర్వత్రా హర్షం వ్యక్తమయ్యేలా చేసింది. ఉద్యోగుల అనుభవాన్ని రాష్ట్ర అభివృద్ధికి వాడుకోవాలన్న సదుద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు, రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా చోటుచేసుకున్న భయంకరమైన రాజకీయ హింసలో దారుణంగా హత్యకు గురైన బీజేపీ కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వం ఒక బృహత్తర నిర్ణయం తీసుకుంది. అభాగ్యులైన ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని మంత్రివర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. కేంద్ర, రాష్ట్ర సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు పారదర్శక, సంక్షేమ పాలన అందించడమే లక్ష్యంగా సర్కారు వేసిన ఈ తొలి అడుగులు బెంగాల్ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చబోతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## బండి సంజయ్ కొడుకుపై పోక్సో కేసు

**హైదరాబాద్, మహా :** గత కొన్ని రోజులుగా రాషఅ్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్ వ్యవహారంలో తెలంగాణ సర్కార్ సీరియస్ అయిన సంగతి తెలిసిందే. వెంటనే ఈ ఘటనపై చర్యలు చేపట్టాలని ఇవాళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈ వ్యవహారం రాష్ట్రంలో సంచలనంగా మారింది. అయితే మే 8వ తేదీనే బాధితుల నుంచి ఫిర్యాదులు వచ్చినా.. పోలీసులు ఎందుకు చర్యలు చేపట్టలేదని సీఎం నిలదీశారు. ఈ క్రమంలోనే కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు స్పష్టం చేశారు. ఈ ఘటన కేవలం బండి సంజయ్ ఫ్యామిలీకి సంబంధించిన అంశమని.. బీజేపీలో జరిగింది కాదని తేల్చి చెప్పారు. సోమవారం మీడియాతో మాట్లాడిన రాంచందర్ రావు బండి భగీరథ్ కేసుతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని క్లారిటీ ఇచ్చారు. కొంతమంది అనవసరంగా ఈ విషయాన్ని బీజేపీకి అంటగడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. బండి భగీరథ్ కేసులో బండి సంజయ్ కుటుంబ సభ్యుల ప్రమేయం ఉంటే విచారణ జరిపించాలన్నారు. ఇది న్యాయపరమైన అంశమని, ఈ విషయంలో చట్టం చేయాల్సిన పని చేస్తుందని రాంచందర్ రావు స్పష్టం చేశారు.

**సభ సక్సెస్ పై హర్షం**

మరోవైపు హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభ సక్సెస్ కావడం పట్ల రాంచందర్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సభ విజయవంతం కావడానికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని సభ పార్టీకి, శ్రేణులకు పెద్ద బూస్టప్ అని అన్నారు. ప్రదాని పర్యటన సందర్భంగా కొంత మంది కావాలని రాద్ధాంతం చేసేందుకు ప్రయత్నించడం దురదృష్టకరమన్నారు. ప్ఢధాన మంత్రి నరేంద్ర మోడీ తెలంగాణకు అన్యాయం చేస్తున్నారంటూ ఇంత కాలం విమర్శించిన వారంతా నిన్నటి ప్రధాని పర్యటన తర్వాత వాస్తవాలు తెలిసి ఉంటాయని అనుకుంటున్నానని అన్నారు.

## బండి సంజయ్ నిస్సాక్షిక విచారణ కోరాలి

**హైదరాబాద్, మహా:** కేంద్రమంత్రి బండిసంజయ్ తనయుడు బండి భగీరథ్ కేసుపై మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బండి కొడుకుపై వచ్చిన ఆరోపణల విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి కుట్రలు, కక్షసాధింపు, వివక్ష చేయడం లేదని మంత్రి పొన్నం అన్నారు. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ తన కుమారుడిపై వచ్చిన ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ కోరాల్సిందని అభిప్రాయపడ్డారు. అలా చేయకుండా కుట్ర చేస్తున్నారని చెప్పి సానుభూతి పొందే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. అసలు ఆ అమ్మాయి బండి సంజయ్‌ని కలిసిన విషయం వాస్తవమా? కాదా? ఆ అమ్మాయితో మీ కొడుకు తిరిగిన విషయం వాస్తవమా? కాదా? అని ప్రశ్నించారు. ఆ విషయాలను నిరూపించి, నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని సూచించారు. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని పొన్నం స్పష్టం చేశారు. ఇక్కడ ఎవరిపై వివక్ష చూపించేది లేదని చెప్పారు. తెలంగాణ ఆడబిడ్డలను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇలాంటి చర్యలు జరిగితే ఆడబిడ్డలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇక సామాజిక వర్గాన్ని రాజకీయం చేయొద్దని, ఆ అమ్మాయి కూడా బండి సంజయ్ సామాజిక వర్గానికి చెందిన అమ్మాయేనని చెప్పారు. మోదీ పర్యటన వల్ల కొంత ఆలస్యమైందని, ఇప్పుడు విచారణ కొనసాగుతుందని చెప్పారు. ఈ వ్యవహారంలో ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా విచారణ చేయిస్తామని హామీ ఇచ్చారు. బండి సంజయ్‌ని ఎంపీగా గౌరవిస్తామని, కానీ ఇలాంటి వ్యవహారాల్లో విచారణ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. విచారణ జరగకుండా అడ్డుపడితే ప్రజాస్వామ్యం దాన్ని గౌరవించదని వ్యాఖ్యానించారు. సీఎం ఆదేశాల మేరకు పోలీసులు పూర్తి స్థాయి విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

## బాలుర కళాశాల, హాస్టల్ ఆకస్మిక తనిఖీ

### వార్డెన్ కు నోటీసు జారీ చేయాలని ఆదేశం.. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి





**మహా వరంగల్ బ్యూరో;** విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వసతి, ఆహార సదుపాయాలు నాణ్యతతో ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆదేశించారు. సోమవారం హనుమకొండ సుబేదారిలోని గిరిజన సంక్షేమ శాఖ పోస్ట్ మెట్రిక్ బాలుర కళాశాల వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని కిచెన్ షెడ్, ఆర్వో వాటర్ ప్లాంట్, టాయిలెట్లు, డార్మెటరీలను పరిశీలించి, నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు.అనంతరం స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన కూరగాయలు, పప్పులు, బియ్యం తదితర ఆహార పదార్థాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, స్టోర్‌లో ఉన్న నిల్వల తో పాటు రికార్డుల్లో నమోదైన వివరాల మధ్య వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే పప్పు దినుసులు, ఇతర ఆహార పదార్థాల నిర్వహణ సరిగ్గా లేకపోవడం పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత వార్డెన్ హాల్ సింగ్‌కు నోటీసు జారీ చేయాలని డీటీడీవో ప్రేమకళను ఆదేశించారు. హాస్టల్‌లో నివసిస్తున్న విద్యార్థులతో కలెక్టర్ ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఏ కళాశాలలో చదువుతున్నారు, భోజనం మరియు స్నాక్స్ సమయానికి అందుతున్నాయా, ఆహార నాణ్యత ఎలా ఉందనే అంశాలపై ఆరా తీశారు. అదేవిధంగా వారానికి ఎన్నిసార్లు చికెన్, మటన్, గుడ్లు అందిస్తున్నారో వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు.హాస్టల్ పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు మెరుగైన వసతి, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన ఆహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని అధికారులకు అన్నారు. విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## హసన్‌పర్తి సీఐగా ఎ.మహేందర్ బాధ్యతలు స్వీకరణ

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన తాజా బదిలీల నేపథ్యంలో హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా ఎ. మహేందర్ సోమవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. గీసుగొండ సీఐ గా విధులు నిర్వహించిన అనంతరం వరంగల్ పీసీఆర్‌లో విధులు నిర్వర్తించిన ఆయనను హసన్‌పర్తి కి బదిలీ చేస్తూ పోలీస్ కమీషనరేట్ ఉత్తర్వులు జారీ చేయగా ఇప్పటివరకు ఆ స్థానంలో కొనసాగిన వి.చేరాలు బదిలీ పై వెళ్లారు.



## ప్రజావాణి అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి.. 126 అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్

**మహా వరంగల్ బ్యూరో;** ప్రజావాణి కార్యక్రమంలో పెండింగ్ అర్జీలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి, జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్, జిల్లా అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, వైద్య ఆరోగ్య, మున్సిపల్, ఎక్సైజ్, ఇతర శాఖలకు సంబంధించి ప్రజలు తమ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు 126అర్జీలను అందజేశారు. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు అందించిన అర్జీలను కలెక్టర్ స్వీకరించి వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీల పరిష్కారంపై ధర్మసాగర్, శాయంపేట, ఐనవోలు మండలాల తహసిల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో అందించే వివిధ రకాల సేవల గురించిన పోర్టల్ గురించిన వివరాలను చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రాజారెడ్డి అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పాత పోర్టల్ లో నమోదు చేశారని, వాటిని సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వస్తున్న దరఖాస్తులను నూతన ప్రజావాణి పోర్టల్ లో నమోదవుతున్నాయని, వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా నూతన ప్రజావాణి పోర్టల్ సంబంధించిన వివిధ అంశాలను జిల్లా కలెక్టర్ సమక్షంలో అధికారులకు ఈడియం శ్రీధర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో శేషాద్రి, డి ఆర్ డి ఓ మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.




## చిన్నారిపై లైంగిక దాడి

- నిందితుడి పై ఫోక్సో కేసు నమోదు
- మట్టెవాడ ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు

**మహా వరంగల్ బ్యూరో;** తేదీ 10 5 2026 మధ్యాహ్నం సుమారు 2 00 గంటల సమయంలో ఎల్ కె జి చదువుతున్న ఓ చిన్నారి ఆడుకోవడానికి పొరుగున ఉన్న కుమ్మరి రాజేందర్ అనే వ్యక్తి ఇంటికి వెళ్లగా, అక్కడ నిందితుడు ఆ చిన్నారి పై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు బాధితురాలి తల్లి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత చిన్నారి (చెప్పరానిచోట) ప్రైవేట్ భాగాల్లో నొప్పిగా ఉందని తల్లికి తెలపడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. నిందితుడు రాజేందర్ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని సదరు బాలిక వివరించింది. దీనిపై ఆదివారం సాయంత్రం బాధితురాలి కుటుంబ సభ్యులు నిందితుడిని నిలదీయగా, అతను బాధ్యతారహితంగా సమాధానం చెప్పి అక్కడి నుండి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో సోమవారం 11 05 2026 సాయంత్రం నిందితుడిని పట్టుకుని బాధితురాలి ఇంటికి తీసుకురాగా, అక్కడ జరిగిన ఘర్షణలో నిందితుడికి స్వల్ప గాయాలయ్యాయి. నిందితుడి భార్య శ్రీలత కూడా బాధితురాలి కుటుంబాన్ని దుర్భాషలాడుతూ నిందితుడికి మద్దతుగా నిలిచింది. జరిగిన ఘటనలో బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు రాజేందర్ పై భారతీయ న్యాయ సంహిత బిఎన్ఎస్ లోని సెక్షన్లు 64(1), 65(2), 296(బి) పోక్సో చట్టం సెక్షన్ 5(ఎం) ఆర్/డబ్ల్యు కు 6 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎన్ కరుణాకర్ రావు తో కలిసి సంబంధిత అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

## ధాన్యం కొనుగోలు త్వరగా చేపట్టాలి



### మంచిర్యాల్ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు త్వరగా చేపట్టాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జైపూర్ మండలం టేకుమట్ల, రామారావుపేట లలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జైపూర్ మండల తహసిల్దార్ వనజా రెడ్డి తో కలిసి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు నగదు చెల్లింపు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సజావుగా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని కోరారు. జిల్లాలో మిల్లింగ్ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే వరి ధాన్యం తప్పనిసరిగా నిబంధనల ప్రకారం శుభ్రపరచి, నాణ్యత ప్రమాణాలు పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కొనుగోలు ప్రక్రియలో హమాలి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని వివరించారు.రైతులు ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఈసారి అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం దెబ్బతినకుండా కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే జిల్లాలో గుర్తించిన గోదాములకు తరలించి నిల్వ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. జిల్లాలో 12 రైస్ మిల్లుల ద్వారా ధాన్యం ప్రక్రియ చేపడుతున్నామని తెలిపారు.

**మత్తడిని పరిశీలించిన కలెక్టర్**

రామారావుపేట గ్రామ చెరువు మత్తడిని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఇండ్ల గణన ప్రక్రియను అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇండ్ల జాబితా బ్లాక్ ల ప్రకారం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం మార్గదర్శకాలను పాటిస్తూ వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. జనగణన గృహ జాబితా ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్త వహించాలని, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని కోరారు. సర్వే ప్రతి గ్రామంలో వేగవంతంగా నిర్వహించాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జనగణన ఆధారంగా రూపొందించడం జరుగుతుందని తెలిపారు.

## ప్రభుత్వ కార్యాలయలలో ఆర్.టి.ఐ. చట్టం–2005 బోర్డులు పెట్టాలి

### ప్రజావాణిలో జాయింట్ కలెక్టర్ కు ఆర్టిఐ వికాస సమితి వినతి

**మంచిర్యాల, మహా :** ప్రభుత్వ కార్యాలయలలో ఆర్.టి.ఐ. చట్టం-2005 బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం ఆర్టిఐ వికాస సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉప్పల రామ్ కిషన్, కాసర్ల శ్రీనివాస్, బండ అవినాష్ లు మంచిర్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ (రెవెన్యూ) రాములు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు, రెవెన్యూ కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాలు, ప్రభుత్వ విద్యాసంస్థలు, ప్రభుత్వ ఆసుపత్రులు, అటవీ శాఖ, అబ్కారీ శాఖ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల, ప్రభుత్వ అనుమతులతో నడుస్తున్న సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలలో సమాచార హక్కు చట్టం ప్రకారం తప్పనిసరిగా సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కొన్ని కార్యాలయాలలో ఉన్న సమాచార హక్కు చట్టం బోర్డులు పాతబడిపోయాయని, కొన్ని కార్యాలయాలలో అసలు సమాచార బోర్డులే లేవని, మరికొన్ని చోట్ల బదిలీపై వెళ్లిన అధికారుల పేర్లు ఉంటున్నాయని వెల్లడించారు. అలాగే సంబంధిత ఆర్టిఐ అధికారుల ల్యాండ్ ఫోన్ నెంబర్లు, మొబైల్ నెంబర్లు పనిచేయడం లేదని ఆరోపించారు. ఉన్న బోర్డులపై అధికారుల హోదాలు పొందుపరచడం లేదని సమాచార హక్కు వికాస సమితి సభ్యులు జాయింట్ కలెక్టర్ రాములు కు వివరించారు. ప్రతి కార్యాలయంలో సమాచార హక్కు చట్టం ప్రకారం పౌర సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి, అప్పీళ్ల అధికారి హోదాలు, మొబైల్ నెంబర్లు, కార్యాలయ పని వేళలు, కార్యాలయం అందిస్తున్న సేవలు ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా సమాచార బోర్డులలో ప్రదర్శించాలని పేర్కొన్నారు. ఇకపోతే సమాచార హక్కు చట్టం సెక్షన్-4 సబ్ సెక్షన్-1(బి) ప్రకారం 17 అంశాలకు సంబంధించిన సమాచారాన్ని అన్ని శాఖల వెబ్‌సైట్లలో ప్రజలకు అందుబాటులో ఉంచాలని వారు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.





## వేసవి శిక్షణ శిబిరాన్ని సందర్శన

నస్పూర్ మండలం తీగల్ పహాడ్ పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని సందర్శించారు. వేసవి శిక్షణ శిబిరం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైనదని, వేసవి సెలవులలో విద్యార్థులు సమయం వృధా చేసుకోకుండా వేసవి శిబిరంలో అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ మద్దతి గృహాలను విద్యార్థులకు అవసరమైన త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ, భోజన శాల వంటి సదుపాయాలను కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం విద్యారంగాన్ని పటిష్టం చేస్తుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా పోషక విలువలతో కూడిన మెనూ అమలు చేస్తూ సకాలంలో విద్యార్థులకు ఆహార అందించి వారి ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందని తెలిపారు. వేసవి శిక్షణ శిబిరాలలో అనుత్తీర్ణులైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడ రంగంలో రాణించాలని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదలతో ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా కృషి చేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యం, సంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలు ఆత్మహత్య

**మందమర్రి, మహా :** మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధి మూడవ జోన్ కు చెందిన గసకంటి కాంతమ్మ (85) అనే వృద్ధురాలు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం వెలుగు చూసింది. స్థానిక ఎస్సై గోపతి నరేష్ కథనం ప్రకారం ఇంటి యజమాని గసకంటి శంకర్ తల్లి కాంతమ్మ, వృద్ధాప్య సమస్యలతో గత కొంతకాలంగా బాధపడుతుందని తెలిపారు. ఈ క్రమంలో శంకర్, తన భార్య గతవారం పనిమిత్తం ఊరికి వెళ్లారని చెప్పారు. కాగా ఇంట్లో శంకర్ కుమారుడు వెంకటేష్, కాంతమ్మ ఇద్దరి మాత్రమే ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం నానమ్మకు వంట చేసి తినమని చెప్పి తన స్నేహితుని వివాహానికి వెళ్లి రాత్రి ఇంటికి రాగా కాంతమ్మ ఇంట్లో చున్ని తో ఉరివేసుకొని చనిపోయిందని పేర్కొన్నారు. మృతురాలి కొడుకు శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసికొని దర్యాప్తులో భాగంగా పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి పంపించినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.



## విద్యార్థులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జిల్లా కలెక్టర్

### ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ టాపర్లకు ఘన సన్మానం.. పాల్గొన్న మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్, కుడా చైర్మన్ డిసిసి అధ్యక్షులు

**మహా వరంగల్ బ్యూరో ;** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగావిద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం యంగ్ అచీవర్ సన్మాన కార్యక్రమమాన్ని ఉర్సుగుట్టలోని ఆకుతోట ఫంక్షన్ హాల్ లో ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ 202526 విద్యా సంవత్సర టాపర్లకు అలాగే వీరితో పాటు చెస్ ఛాంపియన్ ఎదుగుతూ రెండు సార్లు ప్రపంచ రికార్డు సాధించిన మాస్టర్ కొండ శ్రీయాంశ్ మురళీ కృష్ణ పటేల్ కు ఘన సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అటవీ దేవాదాయ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి పాల్గొని పదవ తరగతిలో ఫలితాలలో 550 అంటే ఎక్కువ వచ్చిన 103 తో పాటు ఇంటర్మీడియట్ లో 980 కంటే ఎక్కువ మార్కులు వచ్చిన 14 మంది విద్యార్థిని విద్యార్థులకు మెడల్స్ మెమొంటో శాలువాలతో ఘనంగా మంత్రి సన్మానించారు. అలాగే అతి చిన్న వయస్సులోనే రెండు ప్రపంచ రికార్డులు సృష్టించిన చెస్ చాంపియన్ చిరంజీవి మాస్టర్ కొండ శ్రీయాంశ్ మురళీ కృష్ణ పటేల్ కు మంత్రి చే ట్రోఫీ,చెస్ బోర్డు తో పాటు యువరాజ్ కిరీటంతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా అటవీ దేవాదాయ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఆడపిల్లలకి చదువెందుకు అనే మాట నుండి ఆడపిల్లలే ర్యాంక్ సాధించటంలో ముందుండే పరిస్థితిని మనం చూస్తున్నాం అన్నారు.



**ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలు**

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలకు మరమ్మత్తులు, పుస్తకాల పంపిణీ , రెండు జతల యూనిఫాంలు ఇవ్వడంతో పాటు కామన్ మెనూ, డైట్ ఛార్జీలపెంపు తో పాటు నాణ్యమైన విద్య అందించడంతో పాటు మిడ్ డే మిల్స్ ద్వారా పౌష్టిక ఆహారం అందించేందుకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

**విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట**

ప్రజా పాలన ప్రభుత్వంలో విద్య, వైద్యం అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వం మన ముఖ్య మంత్రి వర్యులు దృష్టి సారించి ప్రభుత్వ స్కూల్స్ అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు.

**కలెక్టర్ కృషి మోటివేషన్ అభినందనీయం**

జిల్లాలో బాలికలదే అత్యధిక ఉత్తీర్ణత చూస్తుంటే అందుకు కారణం జిల్లా కలెక్టర్ కృషి , స్ఫూర్తి మోటివేషనల్ క్లాసుల ఏర్పాటు చేయడం అలాగే కంప్లైంట్ బాక్స్ లు ఏర్పాటులో పిల్లల్లో ఆత్మవిశ్వాసం తో పాటు స్కూల్ హెడ్మాస్టర్ల కృషి ఫలితంగానే ఈ రోజు యంగ్ అచీవర్ సన్మాన కార్యక్రమం నిర్వహించుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. మాస్టర్ కొండా శ్రీయాంశ్ మురళీకృష్ణ పటేల్ గురించి మాట్లాడుతూ 45 రోజుల ట్రైనింగ్ లో భాగంగా 92 సెగ్మెంట్స్ 21 బోర్డ్స్ తో రికార్డ్ సృష్టించిన ఎమర్జింగ్ చెస్ చాంపియన్ మాస్టర్ కొండా శ్రీయాంశ్ మురళీ కృష్ణ పటేల్ అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కలలు కనండి.. ఆ కలలు నిజమయ్యే లా అహర్నిశలు కష్ట పడాలన్నారు.మన పై మనకు నమ్మకం ఉన్నప్పుడే లక్ష్యాలు సాధించ గలమని ఎంపీ అన్నారు.విద్యార్థులు ఎప్పుడూ పాజిటివ్ థింకింగ్ తో ముందుకు సాగాలని ,సోషల్ మీడియాకు దూరంగా ఉంటేనే ఫోకస్ పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి చదివించాలని ,అంబేద్కర్ చెప్పిన 'పే బ్యాక్ టు సొసైటీ' భావన అలవర్చుకోవాలి అని ఈసందర్భంగా పేర్కొన్నారు. శ్రీయాంశ్ భవిష్యత్తులో వరంగల్ కు మరింత పేరు తీసుకురావాలి అన్నారు.పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చు అన్నారు.పదో తరగతిలో 550కు పైగా మార్కులు, ఇంటర్ లో 980కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య వారికి సర్టిఫికెట్లు అందజేశారు.అలాగే అతి చిన్న వయసులోనే ఎమర్జింగ్ చెస్ చాంపియన్ షిప్ లో రెండు ప్రపంచ రికార్డులు సృష్టించిన కొండా శ్రీయాంశ్ మురళీకృష్ణ పటేల్‌ను ప్రత్యేకంగా అభినందించి ఆశీస్సులు అందజేశారు.విద్యార్థుల విజయాలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కష్టానికి ప్రతిఫల మని అన్నారు. కడియం ఫౌండేషన్ ద్వారా 2016 నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంచడమే లక్ష్యంగా మోటివేషన్ కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. "ఔటర్ మోటివేషన్, ఇన్నర్ మోటివేషన్ అని రెండు రకాలుగా ఉంటాయి. జీవితంలో ముందుకు వెళ్లాలంటే మనకోసం మనమే భవిష్యత్తు కోసం లక్ష్యాన్ని ఏర్పరచు కోవాలన్నారు.విద్యార్థులు ఎప్పుడూ పాజిటివ్ థింకింగ్ తో ఉండాలని, అనుకున్నది పట్టుదలతో సాధించాలని సూచించారు.



# ఓటు బ్యాంకుగా బీసీలు



తెలంగాణ రాజకీయాల్లో ప్రతి ఎన్నిక వచ్చినప్పుడూ అత్యధికంగా వినిపించే పేరు బీసీలు. సభల్లో మాటలు వాళ్ల గురించి, మ్యానిఫెస్టోల్లో హామీలు వాళ్ల కోసం, ర్యాలీల్లో నినాదాలు వాళ్ల పేరుతో వినిపిస్తుంటాయి. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత అధికార కుర్చీల దగ్గర వాళ్లు ఎంతమంది కనిపిస్తున్నారు? అసలు ప్రశ్న ఇక్కడే మొదలవుతుంది. తెలంగాణ సమాజంలో బీసీలు పెద్ద శాతం. గ్రామాల్లో పని చేసే చేతులు వాళ్లవి. పట్టణాల్లో జీవన చక్రం తిప్పే వృత్తులు వాళ్లవి. ఎన్నికల సమయంలో పార్టీ జెండాలు మోసేది వాళ్లే. సభలకు జనాన్ని తీసుకురావడం వాళ్లే. కానీ నిర్ణయాలు తీసుకునే గదుల్లో మాత్రం వాళ్ల స్వరం చాలా సార్లు కనిపించదు. రాజకీయ పార్టీలు బీసీలను ఒక "వోటు బ్యాంక్"గా చూస్తున్నాయా? లేక నిజమైన భాగస్వాములుగా గుర్తిస్తున్నాయా? అనే ప్రశ్న ఇప్పుడు మరింత బలంగా వినిపిస్తోంది.

ఇది కేవలం పదవుల సమస్య కాదు. ఇది ప్రాతినిధ్యం గురించిన ప్రశ్న. ఒక సమాజం తన సంఖ్యకు తగిన స్థానం పొందుతున్నదా లేదా అన్న ప్రశ్న. ఎన్నికల ముందు "సామాజిక న్యాయం" అనే మాట బలంగా వినిపిస్తుంది. కానీ టికెట్లు ఇచ్చే సమయంలో, ముఖ్యమైన పదవులు పంచే సమయంలో, పాలసీలు రూపొందించే సమయంలో అదే న్యాయం ఎందుకు బలహీనపడుతుంది? బీసీల గురించి మాట్లాడటం సులువు. కానీ బీసీలకు అధికారం పంచడం అంత సులువుగా ఎందుకు మారడం లేదు? తెలంగాణ ఉద్యమంలో కూడా చాలా బీసీ వర్గాల పాత్ర గొప్పది. రోడ్ల మీద నినాదాలు చేసిన గొంతుల్లో వాళ్ల గొంతు కూడా ఉంది. ఆందోళనల్లో ముందున్న చేతుల్లో వాళ్ల చేతులు కూడా ఉన్నాయి. అయితే తెలంగాణ వచ్చిన తర్వాత అధికార నిర్మాణంలో వాళ్ల స్థానం ఎంత పెరిగింది? ఈ ప్రశ్న అడిగితే దాన్ని కుల రాజకీయంగా చూడకూడదు. ఎందుకంటే ఇది విభజన కోసం కాదు సమాన భాగస్వామ్యం కోసం.

ప్రజాస్వామ్యం అంటే ఓటు వేయించే హక్కు మాత్రమే కాదు, అధికారంలో భాగం అయ్యే అవకాశం కూడా. ఒక వర్గం కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తొస్తే అది రాజకీయ అవసరం కావచ్చు. కానీ అదే వర్గం నిర్ణయాల సమయంలో కూడా కనిపిస్తేనే అది నిజమైన ప్రజాస్వామ్యం అవుతుంది. సగానికి సగం జనాభా ఉన్న ప్రజలను పది శాతం కూడా లేని వర్గాలు పాలించడం అంటే సమస్య కేవలం రాజకీయాల్లో లేదు సమస్య చైతన్యంలో ఉంది. ఎందుకంటే సంఖ్య ఎక్కువగా ఉండటం ఒక్కటే సరిపోదు. ఆ సంఖ్యకు రాజకీయ దిశ కూడా ఉండాలి. సామాజిక అవగాహన కూడా ఉండాలి. అధికారాన్ని ప్రశ్నించే ధైర్యం కూడా ఉండాలి.

బీసీలు దేశంలోనే కాదు, తెలంగాణలో కూడా అతిపెద్ద సామాజిక వర్గాల్లో ఒకటి. అనేక అధ్యయనాలు, సామాజిక అంచనాలు బీసీల జనాభా 50 శాతానికి పైగానే ఉందని చెబుతున్నాయి. కానీ ఆ జనాభాకు తగ్గట్టుగా శాసనసభల్లో, పార్లమెంట్‌లో, ఉన్నత పదవుల్లో ప్రాతినిధ్యం ఉందా? అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం కనిపించదు.

బీసీ రిజర్వేషన్ల చర్చ కూడా ఇక్కడే వస్తుంది. రిజర్వేషన్లు అంటే కేవలం ఉద్యోగాల కోసం ఇచ్చే సౌకర్యం కాదు. శతాబ్దాలుగా వెనుకబాటుకు గురైన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించే ఒక సామాజిక హక్కు. కానీ ఇప్పటికీ బీసీ రిజర్వేషన్ల విషయంలో స్పష్టత లేకపోవడం, కులగణనపై రాజకీయ సంకోచం ఉండటం, స్థానిక సంస్థల్లో బీసీల వాటాపై వివాదాలు రావడం ఇవన్నీ సామాజిక న్యాయం ఇంకా పూర్తిగా అమలు కాలేదనే విషయాన్ని చూపిస్తున్నాయి. ఇంత పెద్ద జనాభా ఉన్న బీసీలు ఇంకా ఎందుకు కులవృత్తుల దగ్గరే ఉండిపోతున్నారు? ఎందుకు చాలా వర్గాలు ఇప్పటికీ శ్రమ ఆధారిత పనుల్లోనే జీవితాలను గడుపుతున్నాయి? ఎందుకు సంపద, విద్య, రాజకీయ అధికారాల్లో సమాన స్థానం సాధించలేకపోతున్నారు? దానికి కారణం కేవలం పేదరికం కాదు. చరిత్రలో నిర్మించబడిన సామాజిక వ్యవస్థ కూడా. కొన్ని వర్గాలకు చదువు, అధికారం, భూములు, వనరులు దగ్గరయ్యాయి. మరికొన్ని వర్గాలకు కేవలం పని మాత్రమే మిగిలింది. తరాల తరబడి అదే కులవృత్తులు కొనసాగాయి. వృత్తులు మారినా, సామాజిక స్థానం మాత్రం పూర్తిగా మారలేదు. ఇప్పుడు కూడా గ్రామాల్లో చూస్తే చాకలి, మంగలి, గౌడ, యాదవ, మత్స్యకార, వడ్డెర, కమ్మరి, కుమ్మరి వంటి అనేక బీసీ వర్గాలు తమ శ్రమతోనే సమాజాన్ని నిలబెడుతున్నాయి. కానీ సమాజాన్ని నిలబెట్టే చేతులకు అధికారంలో తగిన స్థానం ఎందుకు దక్కడం లేదు?

ఇక్కడ అసలు ప్రశ్న బీసీలు ఇంకా ఎందుకు తమ రాజకీయ శక్తిని గుర్తించలేకపోతున్నారు? ఎందుకు ప్రతి ఎన్నికలో వాళ్లు ఇతరుల కోసం పని చేస్తారు, కానీ తమ కోసం రాజకీయ నిర్మాణం కట్టుకోలేకపోతున్నారు? ఎందుకు అగ్రకుల రాజకీయ పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూస్తున్నాయి? దానికి ఒక ముఖ్యమైన కారణం రాజకీయ చైతన్యం లోపించడమే. చైతన్యం లేని సమాజం ఎప్పుడూ ఉపయోగించబడుతుంది. ప్రశ్నించని వర్గం ఎప్పుడూ నియంత్రించబడుతుంది. బీసీలు ఇంకా ధర్నా చౌక్ దగ్గరే ఎందుకు ఆగిపోతున్నారు? ప్రెస్ క్లబ్ మీటింగ్స్ వరకే ఎందుకు పరిమితం అవుతున్నారు? రోడ్ల మీద నినాదాల నుంచి అధికార టేబుళ్ల వరకు ప్రయాణం ఎందుకు చేయలేకపోతున్నారు? దానికి కారణం కేవలం ఇతరుల ఆధిపత్యం కాదు. తమలో రాజకీయ అధ్యయనం తగ్గిపోవడం కూడా.మనం ఇంకా కుల గర్వంలోనే ఆగిపోయాం. మత నినాదాల్లోనే మునిగిపోయాం. దేవుడి పేరుతో రోడ్ల మీద తిరుగుతున్నాం. కానీ అధికార నిర్మాణం ఎలా పనిచేస్తుందో తెలుసుకోవడానికి పుస్తకం మాత్రం తెరవడం లేదు. అందుకే మన శ్రమ ఇతరుల అధికారంగా మారుతోంది. మన సంఖ్య ఇతరుల బలంగా మారుతోంది. మన ఓటు ఇతరుల రాజ్యంగా మారుతోంది.

బీసీలు ఇంకా జనసమూహంగానే మిగిలిపోతారా? లేక రాజకీయ శక్తిగా మారుతారా? ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ఎవ్వరూ ఖాళీగా అధికారం ఇవ్వరు. అది తెలుసుకున్న వాళ్లు తీసుకుంటారు. బీసీలు తమ చరిత్రను ఎందుకు చదవడం లేదు? తమ కోసం పోరాడిన నాయకులను ఎందుకు తెలుసుకోవడం లేదు? తమ హక్కుల కోసం జరిగిన ఉద్యమాల గురించి తెలుసుకోవాలనే తపన ఎందుకు కనిపించడం లేదు? ఎందుకంటే ఈ దేశంలో అణగారిన వర్గాలకు విద్య కేవలం పాఠశాలల దూరం మాత్రమే కాదు చరిత్ర నుంచి కూడా దూరం చేశారు. తమ గొప్పతనాన్ని, తమ పోరాటాలను, తమ తత్వాన్ని తెలుసుకోకుండా ఒక వర్గాన్ని కేవలం ఓటు బ్యాంక్‌గా ఉంచడం చాలా సులువు.

అందుకే బీసీల్లో చాలా మంది ఇంకా కులం, మతం, దేవుడు, ఊరేగింపులు, భావోద్వేగ రాజకీయాల దగ్గరే ఆగిపోతున్నారు. కానీ అధికార నిర్మాణం ఎలా పనిచేస్తుంది? ప్రాతినిధ్యం అంటే ఏమిటి? రిజర్వేషన్ ఎందుకు వచ్చింది? సామాజిక న్యాయం అంటే ఏమిటి? అనే విషయాలపై లోతైన అధ్యయనం తక్కువగా కనిపిస్తోంది. ఒక సమాజం తన చరిత్రను చదవకపోతే ఇతరులు రాసిన చరిత్రలోనే బతకాల్సి వస్తుంది. తమ కోసం పోరాడిన నాయకులను మరచిపోయిన వర్గం తమ హక్కుల కోసం కొత్త పోరాటం నిర్మించలేరు. అందుకే బీసీలకు ఇప్పుడు అవసరం కేవలం రాజకీయ నినాదాలు కాదు రాజకీయ అధ్యయనం. కేవలం సభలు కాదు సామాజిక అవగాహన. కేవలం ఓటు కాదు ఆలోచన. ఎందుకంటే చరిత్ర చెబుతున్న ఒక నిజం ఉంది. చదివిన వర్గాలే అధికారాన్ని నిర్మిస్తాయి. చదవని వర్గాలు మాత్రం ఇతరుల అధికారానికి బలం అవుతాయి.

చాలా కాలంగా ఈ దేశ రాజకీయాల్లో ఒక నిశ్శబ్దమైన ఆధిపత్యం పనిచేస్తూనే ఉంది. అది కేవలం అధికారంతో కాదు ఆలోచనల మీద ఆధిపత్యంతో. అగ్రకుల రాజకీయ శక్తులు బీసీలను కేవలం ఓటర్లుగానే చూడలేదు. వాళ్ల ఆలోచనా ప్రపంచాన్ని కూడా నియంత్రించే ప్రయత్నం చేశాయి. దేవుడు, మతం, సంప్రదాయం, కులవృత్తి ఇవన్నీ సహజంగా మన సంస్కృతిలో భాగమే అయినా, వాటిని ఒక రాజకీయ ఆయుధంగా మార్చిన విధానం గురించి మాట్లాడాల్సిన అవసరం ఉంది. బీసీలకు తరాల తరబడి ఇలా చెప్పబడింది. నీ వృత్తే నీ గౌరవం. నీ పని చేయడం ధర్మం. సంప్రదాయాన్ని కాపాడటం నీ బాధ్యత. అలా వాళ్ల జీవితాలను కులవృత్తుల చుట్టూ మాత్రమే పరిమితం చేశారు. కానీ అదే సమయంలో అధికార వ్యవస్థ, విద్యా నిర్మాణం, ఆర్థిక వనరులు, రాజకీయ నిర్ణయాలు మాత్రం కొద్ది వర్గాల చేతుల్లోనే కేంద్రీకృతమయ్యాయి. ఒకవైపు బీసీలకు జాతరలు, ఊరేగింపులు, మత భావోద్వేగాలు, కుల సంఘాల గర్వం చూపించారు. మరోవైపు అసలు అధికారం ఎలా పనిచేస్తుంది? బడ్జెట్ ఎవరూ నిర్ణయిస్తారు? పాలసీలు ఎవరి చేతుల్లో ఉంటాయి? విద్య, మీడియా, రాజకీయ వ్యవస్థల మీద నియంత్రణ ఎవరిది? అనే ప్రశ్నల దగ్గరికి రానివ్వలేదు. ఇది యాదృచ్ఛికం కాదు. ఎందుకంటే ఆలోచించే సమాజం ప్రశ్నిస్తుంది. ప్రశ్నించే సమాజం భాగస్వామ్యం కోరుతుంది. భాగస్వామ్యం కోరిన రోజు ఆధిపత్య రాజకీయాలు బలహీనపడతాయి. అందుకే చాలా సందర్భాల్లో బీసీలను భావోద్వేగాల దగ్గరే ఆపేశారు. ఒక దశలో బీసీలు తమ గురించి తామే ఆలోచించే అవకాశాన్ని కూడా కోల్పోయారు. వాళ్ల కోపం ఎవరి మీద ఉండాలో, వాళ్ల గర్వం దేనిపై ఉండాలో, వాళ్ల రాజకీయ నిర్ణయం ఎటు వెళ్లాలో కూడా ఇతరులే నిర్ణయించే పరిస్థితి వచ్చింది. అంటే కేవలం భూములు, పదవులు, సంపద మాత్రమే కాదు ఆలోచనలను కూడా కబ్జా చేశారు. అందుకే చాలా మంది బీసీ యువకులు తమ చరిత్ర గురించి కాకుండా ఇతరుల గొప్పతనాన్ని ఎక్కువగా తెలుసుకుంటున్నారు. తమ హక్కుల గురించి కాకుండా భావోద్వేగ నినాదాల కోసం ఎక్కువగా పోరాడుతున్నారు.

ఒక సమాజాన్ని బలహీనపరచాలంటే దాని చేతుల్లోని ఆయుధాలు తీసేయాల్సిన అవసరం లేదు. దాని మెదడులో ప్రశ్నలు రాకుండా చేస్తే సరిపోతుంది. అందుకే ఇప్పుడు బీసీలకు అత్యవసరమైన పోరాటం కేవలం రిజర్వేషన్ల కోసం కాదు ఆలోచనా విముక్తి కోసం కూడా. ఎందుకంటే ఒక వర్గం తన గురించి తాను ఆలోచించడం మొదలుపెట్టిన రోజు నుంచే అసలు రాజకీయ మార్పు ప్రారంభమవుతుంది.



- బసడ
సంపత్ యాదవ్,
70321 32593


# ప్రధాని సూచనల్లో ఆర్థిక హెచ్చరికలు

దేశ ప్రజలకు ఒక ప్రధాని నేరుగా "బంగారం కొనొద్దు", "విదేశీ వస్తువుల వినియోగం తగ్గించండి", "వంటనూనె పొదుపు చేయండి", "రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించండి" అంటూ సూచనలు చేయడం భారత రాజకీయ, ఆర్థిక చరిత్రలో అరుదైన విషయంగా ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. గతంలో ఎన్నో ఆర్థిక సంక్షోభాలు వచ్చినప్పటికీ, ఈ స్థాయిలో ప్రజల వ్యక్తిగత వినియోగ అలవాట్లను మార్చాలని ఏ ప్రధాని బహిరంగంగా సూచించలేదని వారు గుర్తుచేస్తున్నారు. అందుకే ప్రస్తుతం ప్రధాని చేసిన వ్యాఖ్యలు కేవలం సాధారణ సూచనలు మాత్రమేనా? లేక భవిష్యత్తులో ఎదురయ్యే ఆర్థిక సమస్యలపై ఒక ముందస్తు హెచ్చరికనా? అనే చర్చ దేశవ్యాప్తంగా ప్రారంభమైంది.ప్రస్తుతం ప్రపంచ పరిస్థితులు స్థిరంగా లేవు. ఒకవైపు యుద్ధాలు, మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లలో అస్థిరత, చమురు ధరల పెరుగుదల, దిగుమతుల వ్యయం పెరగడం వంటి అంశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో భారత్ వంటి పెద్ద జనాభా ఉన్న దేశం తన విదేశీ మారకద్రవ్య నిల్వలను జాగ్రత్తగా వినియోగించాల్సిన అవసరం ఉందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ప్రధాని చేసిన సూచనల వెనుక కూడా ఇదే ఆలోచన కనిపిస్తోందని వారు విశ్లేషిస్తున్నారు.

భారతదేశంలో బంగారం వినియోగం ప్రపంచంలోనే అత్యధికంగా ఉంటుంది. పెళ్లిళ్లు, శుభకార్యాలు, పండుగలు వచ్చినప్పుడల్లా కుటుంబాలు భారీగా బంగారం కొనుగోలు చేస్తుంటాయి. కానీ ఆ బంగారం ఎక్కువగా విదేశాల నుంచే దిగుమతి అవుతుంది. అంటే ప్రజలు ఎంత ఎక్కువగా బంగారం కొంటే, అంత ఎక్కువ విదేశీ మారకద్రవ్యం దేశం నుంచి బయటకు వెళ్తుంది. గతంలో ఆర్థిక సంక్షోభ సమయాల్లో ప్రజలు దేశహితం కోసం తమ బంగారాన్ని ప్రభుత్వానికి ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి రాకముందే ప్రజలు స్వయంగా నియంత్రణ పాటించాలని ప్రధాని సూచించడం గమనార్హం. ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ సూచనలు భవిష్యత్తులో విదేశీ మారకద్రవ్యంపై ఒత్తిడి పెరిగే అవకాశాలను ప్రతిబింబిస్తున్నాయి. ముఖ్యంగా చమురు, బంగారం, వంటనూనెల వంటి అవసరాల కోసం భారత్ భారీగా దిగుమతులపై ఆధారపడుతోంది. ప్రపంచ మార్కెట్లలో ధరలు ఒక్కసారిగా పెరిగితే దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం పడే ప్రమాదం ఉంటుంది. అందుకే ఇప్పటి నుంచే ప్రజల్లో పొదుపు, నియంత్రణ, స్వదేశీ వినియోగంపై అవగాహన పెంచాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

"దానం అక్కర్లేదు.. బంగారం కొనకుంటే చాలు" అనే వ్యాఖ్యలో ఒక పెద్ద ఆర్థిక సందేశం దాగి ఉందని నిపుణులు చెబుతున్నారు. బంగారం కొనుగోలు తగ్గితే కుటుంబాలు అప్పుల బారిన పడకుండా ఉంటాయి. అదే సమయంలో దేశానికి విదేశీ నిల్వలు ఆదా అవుతాయి. ప్రస్తుతం మధ్యతరగతి కుటుంబాల్లో పెళ్లిళ్ల కోసం అధికంగా అప్పులు చేసి బంగారం కొనుగోలు చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీని వల్ల కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతోంది. కనుక అవసరానికి మించి ఖర్చు చేయకుండా ఉంటే కుటుంబ ఆర్థిక స్థిరత్వం కూడా మెరుగుపడుతుంది. విదేశీ వస్తువుల వినియోగం తగ్గించాలని ప్రధాని చేసిన సూచన కూడా ప్రస్తుత పరిస్థితుల్లో కీలకమైంది. గ్లోబల్ మార్కెట్ ప్రభావంతో విదేశీ బ్రాండ్లపై ఆకర్షణ పెరిగింది. చిన్న చిన్న వస్తువుల నుంచి ఎలక్ట్రానిక్ పరికరాల వరకు విదేశీ ఉత్పత్తుల వినియోగం అధికమైంది. అయితే దీని ప్రభావం దేశీయ పరిశ్రమలపై పడుతోంది. స్థానిక ఉత్పత్తులకు డిమాండ్ తగ్గితే ఉపాధి అవకాశాలు కూడా తగ్గే ప్రమాదం ఉంటుంది. "మేడిన్ ఇండియా" వస్తువులను ప్రోత్సహించడం ద్వారా దేశీయ పరిశ్రమలు బలపడటమే కాకుండా విదేశీ మారకద్రవ్య వినియోగం కూడా తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.


రాగి గురించి ప్రధాని ప్రస్తావించడం కూడా భవిష్యత్తు పారిశ్రామిక సమస్యలపై సంకేతంగా భావిస్తున్నారు. ఒకప్పుడు దేశంలో అందుబాటులో ఉన్న వనరులు, పరిశ్రమలు ఇప్పుడు క్రమంగా తగ్గిపోతున్నాయి. కాపర్ ప్లాంట్లు మూతపడటం వల్ల దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది. ఇదే పరిస్థితి ఇతర రంగాల్లో కూడా వస్తే దేశ పరిశ్రమల వ్యయం పెరిగే అవకాశం ఉంది. అందుకే స్వదేశీ ఉత్పత్తి వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వంటనూనె వినియోగం తగ్గించాలని ప్రధాని చెప్పడం ఆరోగ్యంతో పాటు ఆర్థిక అంశాన్నీ ప్రతిబింబిస్తోంది. భారత్‌లో వంటనూనెల దిగుమతులపై భారీగా విదేశీ మారకద్రవ్యం ఖర్చవుతోంది. ప్రతి కుటుంబం 10 శాతం వినియోగం తగ్గించినా దేశస్థాయిలో అది పెద్ద ఆదాగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో ప్రజల ఆరోగ్యంపై కూడా సానుకూల ప్రభావం పడుతుంది. వ్యవసాయ రంగంపై చేసిన సూచనలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల భూమి సారం తగ్గిపోవడంతో పాటు దిగుమతుల వ్యయం పెరుగుతోంది. ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువుల వినియోగం పెంచితే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే డీజిల్ పంపులకు బదులుగా సోలార్ పంపులను ఉపయోగించడం ద్వారా ఇంధన వ్యయం తగ్గడంతో పాటు పర్యావరణానికి కూడా మేలు జరుగుతుంది. మొత్తంగా చూస్తే ప్రధాని సూచనలు కేవలం వినియోగ నియంత్రణ గురించి మాత్రమే కాదు.. భవిష్యత్తులో దేశం ఎదుర్కొనే ఆర్థిక సవాళ్లపై ముందస్తు హెచ్చరికలుగా కూడా కనిపిస్తున్నాయని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రపంచ పరిస్థితులు వేగంగా మారుతున్న వేళ, ప్రజలు ఇప్పటి నుంచే తమ జీవనశైలిలో మార్పులు చేసుకుంటేనే భవిష్యత్తు ఆర్థిక ఒత్తిడులను తట్టుకునే అవకాశం ఉంటుందని వారు చెబుతున్నారు. దేశ ఆర్థిక బలం కేవలం ప్రభుత్వ నిర్ణయాలపై మాత్రమే ఆధారపడదు. ప్రజల వినియోగ అలవాట్లు, పొదుపు విధానం, స్వదేశీ ఉత్పత్తులపై నమ్మకం కూడా అంతే ముఖ్యమని ప్రధాని సూచనలు మరోసారి గుర్తు చేస్తున్నాయి.



- నాగరాజు గుప్త తాళ్ళపల్లి
సీనియర్ కరస్పాండెంట్
8309727341

## కోయి కోటేశ్వర రావుకి మద్దూరి నగేష్ బాబు జాతీయ కవితా పురస్కారం

ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య కోయి కోటేశ్వరరావు మద్దూరి నగేష్ బాబు జాతీయ పురస్కారానికి ఎంపికైనట్లు పి శ్రీనివాస్ గౌడ్ నేడు ఒక ప్రకటనలో తెలియ జేశాడు. ఈ పురస్కారానికి రెం డు రాష్ట్రాల నుండి 75 కవితా సంపుటులు రాగా వాటిని పరిశీలించిన న్యాయ నిర్ణేతలు కోయి కోటేశ్వర రావు 'నాగ స్వరం 'కవితా సంపుటి ని ప్రధాన పురస్కారానికికి ఎంపిక చేసినట్లు శ్రీనివాస గౌడ్ తెలియజేశాడు. ఈ పురస్కారం కింద పదిహేను వేల(15000) నగదు బహుమతి , జ్ఞాపిక తో పాటు కోటేశ్వరరావుని సత్కరించ నున్నట్లు ఆయన తెలిపారు. మే 23 సాయంత్రం హైదరాబాద్ రవీంద్ర భారతిలో బహుమతి ప్రధాన సభ జరుగుతుంది.



# విజ్ఞాన భారతావని అక్షరసంకల్పం

భారతదేశం విజ్ఞాన ఆధారిత సమాజంగా రూపాంతరం చెందుతున్న క్రమంలో 'సంపూర్ణ అక్షరాస్యత' అనే మహోన్నత లక్ష్యం నేడు అక్షర సత్యంగా మారుతోంది. కేవలం అక్షరాలు నేర్పడమే కాకుండా, పౌరుల్లో సామాజిక చైతన్యాన్ని నింపే లక్ష్యంతో సాగుతున్న ఈ ప్రయాణం, మే 2026 నాటికి సరికొత్త శిఖరాలను అధిరోహించింది. జన్ భాగీదారి, స్వచ్ఛంద సేవ, మరియు కర్తవ్యబోధ అనే ముక్కోణపు వ్యూహంతో దేశవ్యాప్తంగా అక్షర జ్యోతి వెలుగుతోంది. ప్రభుత్వాల సంకల్పం, ప్రజల భాగస్వామ్యం కలిసి అజ్ఞాన తిమిరాన్ని పారద్రోలుతూ అక్షర భారతాన్ని ఆవిష్కరిస్తున్నాయి. భారతదేశ అక్షరాస్యత పటంలో ఏడు రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలు నూరు శాతం అక్షరాస్యతను ప్రకటించుకుని దేశానికే దిక్సూచిగా నిలిచాయి. చండీగఢ్ 99.9 శాతం అక్షరాస్యతతో అగ్రస్థానంలో నిలిచి అక్షర జయభేరి మోగించగా, పర్యాటక స్వర్గం గోవా 99.7 శాతంతో రెండో స్థానంలో నిలిచింది. పర్వత ప్రాంతమైన హిమాచల్ ప్రదేశ్ మరియు సముద్రపు దీవులైన అండమాన్ నికోబార్‌లు 99 శాతంతో అద్భుత ప్రగతిని కనబరిచాయి. ఈశాన్య రాష్ట్రం మిజోరాం 98.2 శాతం, లక్షద్వీప్ 97.3 శాతం, మరియు హిమాలయ గిరి ప్రాంతం లడఖ్ 97 శాతంతో అక్షర శిఖరాలను అధిరోహించాయి. ఈ ప్రాంతాలు భౌగోళిక సవాళ్లను అధిగమించి సాధించిన విజయం విద్యా రంగంలో ఒక చారిత్రక మైలురాయిగా నిలిచిపోతుంది. సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యానికి అత్యంత చేరువలో ఉన్న రాష్ట్రాలు దేశానికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తున్నాయి. నాగాలాండ్ 95.7 శాతం, త్రిపుర 95.6 శాతం మరియు విద్యా విప్లవానికి మారుపేరైన కేరళ 95.3 శాతంతో 95 శాతం మార్కును దాటేశాయి. వీటి వెంటే మేఘాలయ 94.2 శాతం, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి 92.7 శాతం, మరియు మణిపూర్ 92 శాతంతో అక్షరాస్యతలో అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పాయి. ఈ ప్రాంతాల్లోని విద్యా చైతన్యం పౌర సమాజాన్ని మరింత పటిష్టపరుస్తోంది. అక్షరాస్యత కేవలం అంకెల్లోనే కాకుండా, ప్రజల జీవన ప్రమాణాల్లో కూడా స్పష్టమైన మార్పును తీసుకువస్తోందని ఈ గణాంకాలు ప్రస్ఫుటం చేస్తున్నాయి.




## విద్యా వికాసంలో ఆర్థిక హబ్‌ల అప్రతిహత ప్రయాణం

దేశ అభివృద్ధికి వెన్నెముకగా నిలిచే రాష్ట్రాలు 80 నుంచి 90 శాతం మధ్య అక్షరాస్యతతో తమ బలాన్ని చాటుకుంటున్నాయి. రాజధాని ఢిల్లీ 87.8 శాతం, పారిశ్రామిక దిగ్గజం మహారాష్ట్ర 87.3 శాతం, ఈశాన్య ద్వారం అస్సాం 87 శాతం మరియు దాద్రా నగర్ హవేలీ 86.9 శాతంతో మెరుగైన ఫలితాలను సాధిస్తున్నాయి. తమిళనాడు 85.5 శాతం, హర్యానా 84.8 శాతం, సిక్కిం 84.7 శాతం, గుజరాత్ 84.6 శాతం మరియు అరుణాచల్ ప్రదేశ్ 84.2 శాతంతో ప్రగతి పథంలో సాగుతున్నాయి. ఉత్తరాఖండ్ 83.8 శాతం, పంజాబ్ 83.4 శాతం, కర్ణాటక 82.7 శాతం, పశ్చిమ బెంగాల్ 82.6 శాతం మరియు జమ్మూ కాశ్మీర్ 82 శాతంతో తమ అక్షర ప్రయాణాన్ని కొనసాగిస్తూ జాతీయ అక్షరాస్యతలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. భారతదేశ ఆత్మ గ్రామాలే అని నిరూపిస్తూ, వ్యవసాయాధారిత , పెద్ద రాష్ట్రాలు 75 నుండి 80 శాతం మధ్య అక్షరాస్యతను నమోదు చేశాయి. ఒడిశా 79 శాతం, ఛత్తీస్‌గఢ్ 78.5 శాతం, మరియు దేశంలోనే అత్యధిక జనాభా కలిగిన ఉత్తరప్రదేశ్ 78.2 శాతంతో విద్యా రంగంలో తమ పట్టును పెంచుకుంటున్నాయి. దక్షిణ భారత రాష్ట్రం తెలంగాణ 76.9 శాతం, జార్ఖండ్ 76.7 శాతం, చారిత్రక రాజస్థాన్ 75.8 శాతం మరియు మధ్యప్రదేశ్ 75.2 శాతంతో క్రమంగా సంపూర్ణ అక్షరాస్యత వైపు అడుగులు వేస్తున్నాయి. ఈ రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన మరియు విద్యా అవగాహన కార్యక్రమాల వల్ల అక్షరాస్యత శాతం నిలకడగా పెరుగుతూ వస్తోంది. ప్రస్తుత నివేదిక ప్రకారం అట్టడుగున ఉన్నప్పటికీ, అక్షరాస్యత శాతాన్ని పెంచుకోవడానికి తీవ్రంగా కృషి చేస్తున్న రాష్ట్రాల జాబితాలో బీహార్ 74.3 శాతం మరియు ఆంధ్రప్రదేశ్ 72.6 శాతంతో ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లోని వెనుకబడిన ప్రాంతాల్లో విద్యా వ్యాప్తికి ప్రత్యేక కృషి అవసరమని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. అయినప్పటికీ, గత సంవత్సరాలతో పోలిస్తే ఈ రాష్ట్రాల్లో అక్షరాస్యతలో వృద్ధి కనిపిస్తోంది. నూతన విద్యా విధానం మరియు ఉల్లాస్ వంటి కార్యక్రమాల ద్వారా ఇక్కడ కూడా వేగంగా అక్షరాస్యత శాతాన్ని పెంచి, జాతీయ సగటుకు సమానంగా తీసుకువచ్చేందుకు ప్రభుత్వం మరియు స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పని చేస్తున్నాయి. అక్షరాస్యత అంటే కేవలం అక్షరాలు నేర్చుకోవడం మాత్రమే కాదు, అది ఒక సమాజపు ఆలోచనా పరిణితిని సూచిస్తుంది. మే 2026 నాటి ఈ నివేదిక భారతదేశం ఒక సమ్మిళిత, సాధికారిక మరియు విజ్ఞాన ఆధారిత సమాజంగా ఆవిష్కృతమవుతోందని చాటి చెబుతోంది. 'ఉల్లాస్' వంటి పథకాల ద్వారా పౌరుల్లో కలుగుతున్న కర్తవ్యబోధ, వాలంటీర్ల నిస్వార్థ సేవ దేశాన్ని సంపూర్ణ అక్షరాస్యత వైపు నడిపిస్తున్నాయి. ప్రతి గడపకూ అక్షర జ్యోతి చేరిన రోజున భారతదేశం ప్రపంచ వేదికపై తన విజ్ఞాన శక్తిని చాటుతూ నిజమైన 'విశ్వగురువు'గా అవతరిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అక్షరమే ఆయుధంగా సాగుతున్న ఈ ప్రయాణం నవ భారత చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం.

- గడల నరసింహారావు,
సీనియర్ జర్నలిస్ట్

## సమ్మర్ క్యాంప్-2026 క్యాంపు క్రీడలు ప్రారంభం



**మందమర్రి, మహా :** సమ్మర్ క్యాంప్-2026 క్యాంపు క్రీడలు సోమవారం మందమర్రి పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి స్థానిక మండల రెవెన్యూ తాసిల్దార్ సతీష్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వర్,మండల విద్యాధికారి, ఏఏపిసి చైర్మన్ లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంప్ మే 11 నుండి మే 25 వరకు 15 రోజుల పాటు కొనసాగుతాయని అన్నారు. ఈ క్రీడలలో విద్యార్థులు పాల్గొని సృజనాత్మకత, ఆత్మవిశ్వాసంతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఇందులో ఆర్ట్, క్రాఫ్ట్, డాన్స్, యోగా, స్టిచింగ్, ఇండోర్ గేమ్స్ వంటి పలు వినూత్న రకాల క్రీడలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మందమర్రి మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమ్మర్ క్యాంప్‌లో చేరి క్రీడా పోటీ తత్వాన్ని చాటాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లక్ష్మీపురంలో ఘర్షణ.. ఒకరి మృతి



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం లక్ష్మీపురం లారీ యార్డ్ సమీపంలో జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందిన ఘటన కలకలం రేపింది. స్థానిక సమాచారం మేరకు ఇద్దరి మధ్య జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారితీసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.మృతుడు ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. హత్యకు గల కారణాలు, మృతుడి పూర్తి వివరాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## పరీక్షల్లో విజయాలు సాధించాలి

**సింగరేణి ఏరియా జిఎం శాలెం రాజు**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** చదువుల్లో రాణిస్తేనే మంచి భవిష్యత్తు ఉంటుందని పరీక్షల సమయంలో విజయాలు సాధించాలని సింగరేణి కొత్తగూడెం ఏరియా జిఎం శాలెం రాజు అన్నారు. రుద్రంపూర్ సింగరేణి సిఈఆర్ క్లబ్ నందు ఏర్పాటు చేసిన స్టడీ రూమ్‌లో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన పుస్తకాల పంపిణీ కార్యక్రమం సోమవారం జీఎం కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ అభ్యర్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ పట్టుదల నిరంతర శ్రమతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ యువత అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించేందుకు అవసరమైన అధ్యయన వాతావరణాన్ని కల్పించేందుకు ఇటువంటి స్టడీ రూమ్‌లు పుస్తకాల పంపిణీ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు అభిప్రాయపడ్డారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల అభివృద్ధి కోసం పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంలో కొత్తగూడెం ఏరియా జీఎం షాలెం రాజు తీసుకున్న ప్రత్యేక చొరవను యూనియన్ నాయకులు కొనియాడారు. అభ్యర్థులకు అవసరమైన అధ్యయన వాతావరణం కల్పిస్తూ వారి భవిష్యత్తు పురోగతికి సింగరేణి యాజమాన్యం అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం షాలెం రాజుతో పాటు ఎస్ఓ టు జీఎం కోటి రెడ్డి, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ముక్కపాటి వెంకటేశ్వర్లు, పర్సనల్ మేనేజర్ తిరుపతి, (ఏఐటీయూసీ)బ్రాంచ్ కార్యదర్శి వి.మల్లికార్జున రావు, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి. రజాక్, ఐఎన్‌టీయూసీ పిట్ కార్యదర్శి సాగర్, అధికారులు అభ్యర్థులు పాల్గొన్నారు.

## పంచాయతీ అక్రమాలపై విచారణ జరపాలని ఫిర్యాదు



**దమ్మపేట ,మహా :** దమ్మపేట మేజర్ గ్రామపంచాయతీ లో జరుగుతున్న అక్రమాలపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి ,న్యాయపరమైన విచారణ జరపాలని కోరుతూ పంచాయతీ వార్డు సభ్యులు అడిషనల్ కలక్టర్ కు సోమవారం ఫిర్యాదు చేశారు. జిల్లా కేంద్రంలో ని కలక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్ లో ఈ మేరకు ఫిర్యాదు అందించినట్లు ప్రతిపక్ష వార్డు సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక పాలన జరిగిన సమయంలో అంటే 2024 నుండి 2025 వరకు అనేక నిధులు దుర్వినియోగం జరిగాయని పేర్కొన్నారు. ఆ విషయంపై ఆరాతీయగా ఇద్దరు ప్రైవేటు వ్యక్తుల బ్యాంకు ఖాతాలలోకి రెండు నెలల జీతాలను బదిలీ చేసి ,ఆ ఖాతా నుండి నిధులు దుర్వినియోగం చేశారని ప్రధానంగా ఆరోపించారు. ఐతే ఈ విషయంపై ప్రస్తుత యంపిడివో ,ఆనాటి ప్రత్యేక అధికారి వివరణ ఇస్తూ పొరబాటున వేరే వ్యక్తుల ఖాతాలకు చెక్ ట్రాన్స్ఫర్ అయ్యిందని ఒక సారి , అలా మార్పిడి జరిగిన చెక్ చెల్లలేదని మరొకసారి చెప్పి ,తప్పులను కప్పిబుచ్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. అంతేగాక ప్రత్యేక పాలన సమయంలో జరిగిన లావాదేవీలు మొత్తం వివరాలు పాలకవర్గ సమావేశంలో తెలియజేయాలని పట్టుపట్టడంతో , సమావేశం జరగాల్సిన ముందురోజునే పంచాయతీ కార్యాలయంలో అనుమానస్పద స్థితిలో దొంగలు పడటం తో మరెన్నో అక్రమ వ్యవహారాలు జరిగే ఉంటాయనే ఆరోపణలకు దారితీసిందన్నారు.

**దోషులను నిర్ధారించి,**
**అధికారులను సస్పెండ్ చేయాలి**

మేజర్ పంచాయతీ లో జరుగుతున్న అక్రమ వ్యవహారాలను ఉన్నతాధికారులు విచారణ జరిపి ,బాధ్యులైన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ,అదే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజాధనం దోపిడీకి ప్రత్యక్షంగా ,పరోక్షంగా బాధ్యులైన అధికారులను విధులనుండి తొలగించాలని వార్డు సభ్యులు కోరుతున్నారు. వాస్తవంగా దొంగలు పడితే నగదు లేదా విలువైన కంప్యూటర్ వంటి వస్తువులను కదా దొంగిలించాల్సింది..? కానీ ఇక్కడ పడిన దొంగలకు కంప్యూటర్ పరిజ్ఞానం కాస్తంత ఎక్కువగా నే ఉందనుకుంటా.. అందుకే కాబోలు కేవలం ప్రత్యేక అధికారుల పాలన కాలం నాటి రిజిస్టర్లను ,విలువైన ఫోల్డర్ ను మాత్రమే దొంగిలించారని వార్డు సభ్యులు పోలీసులకు చేసిన ఫిర్యాదు లో పేర్కొన్నారు. ఏదిఏమైనా ప్రజాధనం దోపిడీ దారుల ఖజానాకు మరల్చడం వెనుక గతంలో జరిగిన అవినీతి లో గానీ ,ప్రస్తుతం జరిగిన అవినీతి లో గాని అధికారుల పాత్ర లేదనేది ఎంతమాత్రం సమంజసం కాదని వార్డు సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# కేంద్ర మంత్రి బండి కుమారుణ్ణి తక్షణమే అరెస్టు చేయాలి

**బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు**
**నడిపెల్లి విజిత్ కుమార్ డిమాండ్**



**మంచిర్యాల, మహా :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ ను తక్షణమే అరెస్టు చేయాలని భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి కేంద్రమంత్రి కుమారుడు బండి సాయి భగీరథ ఒక మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడడం దుర్మార్గం అని అన్నారు. అధికార దాహంతో అన్యాయం జరిగిన ఆడపిల్ల పైనే కేసుకు నమోదు చేయడం దురదృష్టకరమని అన్నారు.కేంద్రమంత్రి కుమారుడిని అరెస్టు చెయ్యకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడుతుందని విమర్శించారు. బిజెపి పార్టీ కేవలం మతాన్ని అడ్డుపెట్టుకొని మాత్రమే రాజకీయం చేస్తుంది కానీ దేశంపై గాని దేశంలో మహిళలపై గాని వారికి ఎలాంటి గౌరవం లేదని విమర్శించారు. కొడుకు తప్పు చేస్తే దండించవలసిన తండ్రికుమారుడిని కాపాడే ప్రయత్నం చేస్తున్నాడని వివరించారు. అందుకుగాను బండి సంజయ్ ని ఏ 1 గా ముద్దాయిగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేంద్ర మంత్రి పదవి నుండి పార్టీ నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి పోలీసు యంత్రాంగం కేవలం అల్లర్లు సృష్టిస్తున్న అధికార పార్టీ నాయకులకు అండదండగా ఉండడమే వారి పనిగా పెట్టుకున్నారని అన్నారు. రాష్ట్రంలో అసలు పోలీసు వ్యవస్థ ఉందా లేదా అని ప్రశ్నించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ క్యాంప్ కార్యాలయం పై దాడి, మాజీ మంత్రి కేటీఆర్ క్యాంప్ కార్యాలయం పై దాడి ,మాజీ మంత్రి హరీష్ రావు క్యాంప్ కార్యాలయం పై దాడి చేస్తున్న పోలీసులు అధికార పార్టీ నాయకులకు కార్యకర్తలకు కొమ్ముకాస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. మూడు నెలల నుండి బాధితులు పోరాడితే కానీ పోలీస్ స్టేషన్లో కనీసం కేసు కూడా నమోదు చేయలేదు అంటే మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారునికి ఎంతగా సపోర్ట్ చేస్తున్నారో అర్థం అవుతుందని పేర్కొన్నారు. 3 రోజుల క్రితం కేసు రిజిస్టర్ చేసిన పోలీసులు ఇంత వరకు నిందితుడిని ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. బిజెపి పార్టీ మత రాజకీయాలు చేయడం వల్లే దేశంలో అల్లర్లు ఎక్కువ అయ్యాయని అన్నారు. బిజెపి పార్టీ నాయకులు మీడియా ఛానల్ ను కొనడం మానేసి ప్రజలకు న్యాయం చేయాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, టీబీజీకేఎస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్వార్థం ఎరుగని కష్టం అడవి బిడ్డలకే సాధ్యం

**ఉపాధి కూలీలను అభినందించిన అనంతారం సర్పంచ్**



**జూలూరుపాడు, మహా:** సాధారణంగా ఆదివాసి అడవి బిడ్డలు ఏ పని చేసినా నిజాయితీగా, నిబద్ధతతో స్వార్థం ఎరుగక ఎంత కష్టానైనా ఇష్టంగా చెయ్యడం వారికే సాధ్యమని అనంతారం సర్పంచ్ కొర్సా రమేష్ వారి కష్టాన్ని కొనియాడారు. మండల పరిధి అనంతారం గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశాన్ని శనివారం ఆయన సందర్శించారు. గ్రామ పరిసరాలలో చెరువులు, కుంటలు లేనందున సమీపంలోని గుట్ట ప్రక్కన ట్రెంచ్ వర్క్ చేపట్టారు. గడ్డపారకు మట్టి తెగని పరిస్థితి, రాళ్లలో కష్టమైన కష్టతరమైన పనిని సుమారు 50 మంది ఆదివాసి ఉపాధి కూలీలు ఇష్టంగా చేయడాని చూసిన గ్రామ సర్పంచ్ కొర్సా రమేష్ వారిని అభినందించారు. పని ప్రదేశంలో త్రాగునీరు, మెడికల్ కిట్ అందుబాటులో ఉండాలని, ఉపాధి కూలీల వేతనాలు సకాలంలో అందే విధంగా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్ బొర్రా నాగమణిని కోరారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కుంజా రవికుమార్, ఎఫ్ఎ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల గణన కార్యక్రమం ప్రారంభం



**నేలకొండపల్లి, మహా :** మండలం లో ఇండ్ల గణన కార్యక్రమం ను సోమవారం తహశీల్దార్ పి.రాంప్రసాద్ ప్రారంభించారు. మండల కేంద్రంలో పలు వార్డులలో పర్యటించి సర్వే ను పరిశీలించారు. ఎన్యూమరేటర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...మండలం లో మొత్తం 93 బ్లాక్ లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 91 మంది ఎన్యూమరేటర్స్, 16 మంది సూపర్వైజర్స్ లను నియమించినట్లు తెలిపారు. సర్వే ఖచ్చితంగా ఉండాలని సూచించారు. సోమవారం నుంచి జూన్ 9 వరకు సర్వే జరుగుతుందని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య. మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు, మండల ఏఎస్వో స్పందన, పంచాయతీ కార్యదర్శి సంతోష్, ఎన్యూమరేటర్స్, సూపర్వైజర్స్ తదితరులు పాల్గొన్నారు.

## "రాజీవ్ యువ వికాసం" పథకం అమలు జరిగేనా...!?

**బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు**



**నేలకొండపల్లి, మహా:** నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన "రాజీవ్ యువ వికాసం" పథకం అమలులో తీవ్ర జాప్యం జరుగుతుండటంపై బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు తీవ్ర విమర్శలు చేశారు. రూ.6000 కోట్లతో ప్రకటించిన ఈ పథకం కేవలం హామీలకే పరిమితమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 5, 2025 న దరఖాస్తుల ప్రక్రియ ముగిసి 13 నెలలు గడిచినా ఇప్పటికీ ఇంటర్వ్యూలు నిర్వహించలేదని ఆవేదన వ్యక్తం చేసారు. జూన్ 2, 2025 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 5 లక్షల మంది లబ్ధిదారులకు మంజూరు లేఖలు, చెక్కులు అందజేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినప్పటికీ ఆ ప్రక్రియ అమలులోకి రాలేదని ఆయన పేర్కొన్నారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ వర్గాల యువతకు రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు 60% నుంచి 100% సబ్సిడీతో రుణాలు ఇస్తామని ప్రకటించినప్పటికీ అమలు జరగలేదని విమర్శించారు. ఖమ్మం జిల్లాలోని వేలాది మంది నిరుద్యోగ యువత ఆశతో దరఖాస్తు చేసుకున్నప్పటికీ, కలెక్టర్ అధ్యక్షతన జరగాల్సిన జిల్లా స్థాయి ఎంపిక కమిటీ సమావేశాలు కూడా పూర్తి కాలేదని తెలిపారు. జూన్ 2న ప్రకటించాల్సిన లబ్ధిదారుల జాబితా ఎందుకు విడుదల కాలేదో ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రూ.6000 కోట్ల బడ్జెట్లో ఎంత ఖర్చు చేశారు, ఎన్ని లోన్లు మంజూరు చేశారు అనే వివరాలను జిల్లా వారీగా ప్రకటించాలని కోరారు. బ్యాంకుల లింకేజీతో వెంటనే లోన్లు మంజూరు చేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 13 నెలల ఆలసత్వానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ఐడిఓసి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రజల నుండి వినతులు ఫిర్యాదులను అదనపు కలెక్టర్ వేణుగోపాల్, గృహ నిర్మాణ శాఖ పీడీ రవీంద్రనాథ్ తో కలిసి స్వీకరించి సమగ్రంగా పరిశీలించారు. జిల్లాలోని పలు మండలాలు గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ వ్యక్తిగత సామూహిక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని తెలిపారు. ప్రతి వినతిపత్రాన్ని బాధ్యతాయుతంగా పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. తక్షణ పరిష్కారం సాధ్యమయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని మిగిలిన సమస్యలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం జాప్యం చోటుచేసుకోకుండా క్రమం తప్పకుండా పర్యవేక్షణ నిర్వహించాలని తెలిపారు. సమస్యల వెనుక ఉన్న మూల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజా సేవలో పారదర్శకత బాధ్యతాయుత ధోరణితో పనిచేయాలని తెలిపారు. ప్రజలు తమ వినతులతో పాటు అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలని ప్రజల సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం గ్రామానికి చెందిన రైతులు ఆర్వోఎఫ్ఆర్ వ్యవసాయ భూముల్లో ఆయిల్ పామ్ మొక్కలకు నీరు అందించేందుకు విద్యుత్ సదుపాయం కల్పించాలని వినతిపత్రం సమర్పించారు. ఫారెస్ట్ శాఖ అనుమతులు మంజూరు చేయకపోవడంతో కరెంట్ లైన్ వేయలేక పోతున్నామని దీంతో ఆయిల్ పామ్ మొక్కలు ఎండిపోతున్నాయని తెలిపారు. దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం ఐటీడీఏ పీవోకు ఎండార్స్ చేశారు.చుంచుపల్లి మండలం వెంకటేశ్వర కాలనీ గ్రామపంచాయతీకి చెందిన షేక్ పర్వీన్ నివసిస్తున్న ఇల్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని ఇందిరమ్మ ఇల్లు కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ జాబితాలో పేరు లేదని తెలిపారు. ఇద్దరు చిన్న పిల్లలతో దయనీయ పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నానని పేర్కొంటూ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరగా దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ చర్యల నిమిత్తం చుంచుపల్లి ఎంపీడీవోకు ఎండార్స్ చేశారు. కొత్తగూడెం గణేష్‌బస్తీ 54వ డివిజన్‌కు చెందిన ఎండీ గౌస్య తమ ఇంటి ముందు ఉన్న వేప చెట్టు కూలిపోవడంతో విద్యుత్ స్తంభం పడిపోయిందని ఇంటిలో షాక్ వస్తోందని తెలిపారు. వర్షాకాలంలో ఇంట్లో నీరు కారడం వల్ల షార్ట్‌సర్క్యూట్ ప్రమాదం ఉందని పేర్కొంటూ సమస్య పరిష్కరించాలని కోరగా దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ చర్యల నిమిత్తం విద్యుత్ శాఖ అధికారులకు ఎండార్స్ చేశారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## మహా పుష్కర కుంభాభిషేకమును విజయవంతం చేయండి

**ముతాపురం సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణారావు**



**నేలకొండపల్లి, మహా :** మండలం లోని మోటాపురంలో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో జరిగే మహా పుష్కర కుంభాభిషేకం ను విజయవంతం చేయాలని మోటాపురం సోసైటీ మాజీ డైరెక్టర్ రావెళ్ల కృష్ణారావు . కోరారు. సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు... దేవాలయం 12 వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 13 నుంచి 15 వరకు మహా పుష్కర కుంభాభిషేకం జరుగుతుందని పేర్కొన్నారు. కావునా భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సూచించారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు నిర్వహణ కమిటి ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం లో జరిగే ఉత్సవాలలో ప్రతీ ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గ్రామంలో ప్రజలు, రైతులు అంతా సుభిక్షంగా ఉండాలని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావునా ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.


## బడి బాటకు యంఈవో సొంత ఖర్చులతో ప్రచా జాత




**నేలకొండపల్లి, మహా :** ప్రభుత్వ విద్య ను బలోపేతం చేసేందుకు నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు ప్రత్యేక కార్యచరణ ను రూపొందించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడి బాట ద్వారా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలనే లక్ష్యంతో తన సొంత ఖర్చులతో విస్తృతంగా ప్రచారం ను చేపట్టారు. ప్రత్యేక ఆటో లో ప్రభుత్వ బడి వలనే కలిగే ప్రయోజనాల గురించి... ప్రభుత్వం అందించే ప్రోత్సాహాలను వివరిస్తూ...మైక్ ద్వారా ప్రచారం ను చేపట్టారు. 32 గ్రామపంచాయతీలలో పది రోజుల పాటు, ప్రతీ రోజు మూడు గ్రామపంచాయతీలలో ప్రతీ వీధిలో ప్రచారం చేసేలా కార్యచరణ ను చేపట్టారు. ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్లను, పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ ప్రతినిధులను కలుపుకుని ప్రచారం చేసే విధంగా చర్యలు చేపట్టారు. గతంలో ఆరెగూడెం పాఠశాల కు. కోనాయిడెం, ఆచారగూడెం గ్రామాల నుంచి వచ్చే విద్యారులకు కోనాయిడెం, ఆచార్లగూడెం గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు ప్రత్యేకంగా సొంత ఖర్చులతో ఆటోలను ఏర్పాటు చేశారు. తాజాగా మండలం వ్యాప్తండా బడిబాట ద్వారా బడి బలోపేతం కోసం యంఈవో బీ.చలపతిరావు సొంత ఖర్చులతో ప్రచార జాత ను ఏర్పాటు చేశారు. యంఈవో చేస్తున్న కృషి ని మండల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు మాట్లాడారు...మండలం విద్యార్థుల నమోదు ను పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమం ను రూపొందించినట్లు తెలిపారు.

# మణుగూరులో వికసించిన మే పుష్పం..

- **మే నెలలో మాత్రమే వికసించే అరుదైన ప్రకృతి వింత..**
- **3 దశాబ్దాలుగా సంరక్షిస్తున్న సింగరేణి విశ్రాంత ఉద్యోగి..**





**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలో అరుదైన మే పుష్పం వికసించి స్థానికులను ఆకట్టుకుంటోంది. మండుతున్న ఎండల మధ్య ఎర్రటి కాంతులతో విరబూసిన ఈ పుష్పం ప్రకృతి అందాలను వెదజల్లుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. పట్టణంలోని ఎక్సలెంట్ విద్యాసంస్థల అధినేత యూసఫ్ షరీఫ్, సింగరేణి విశ్రాంత ఉద్యోగి కుర్రి రాజేశ్వరరావుల నివాసాల ఆవరణలో వికసించిన ఈ పుష్పాలను చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని సుందరయ్యనగర్ వీధిలో, మణుగూరు సింగరేణి విశ్రాంత ఉద్యోగి కురి రాజేశ్వరరావు స్వగృహంలో ప్రతి ఏడాది లాగానే ఈ ఏడాది కూడా మే పుష్పం వికసించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత మూడు దశాబ్దాలుగా ఈ చిరు మొక్కలను సంరక్షిస్తూ వస్తున్నానని, ప్రతి సంవత్సరం మే నెలలో పుష్పం విరబూయడం ఎంతో ఆనందాన్నిస్తుందని రాజేశ్వరరావు తెలిపారు.ఒక మొక్కకు ఒకే పుష్పం మాత్రమే పూయడం, వందలాది సన్నని సూది కాడలతో గుండ్రటి ఆకారంలో ఎర్రటి వెలుగులు విరజిల్లేలా కనిపించడం ఈ పుష్పం ప్రత్యేకతన్నారు. ఎంత చూసినా మళ్లీ మళ్లీ చూడాలనిపించే అందంతో ప్రకృతి ప్రేమికులను ప్రతి ఏడాది అలరిస్తోందని తెలిపారు. వర్షాకాలం రాకకు సూచికగా భావించే ఈ పుష్పం సంవత్సరంలో ఒక్క మే నెలలో మాత్రమే దర్శనమివ్వడం విశేషం. పుష్పం వికసించిన ఐదు రోజుల్లోనే క్షీణించిపోవడం మరో ప్రత్యేకతగా చెప్పుకుంటున్నారు. ఈ ఏడాది ముందుగానే పూయడంతో జిల్లాలోనే తొలిసారిగా వికసించిన పుష్పంగా స్థానికులు భావిస్తున్నారు. మే పుష్పాన్ని చూసేందుకు పరిసర ప్రాంతాల ప్రజలు, ప్రకృతి ప్రేమికులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

# పంటల కొనుగోలులో అవినీతి అక్రమాలను అరికట్టాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు.. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కలెక్టరేట్ ఎదుట సిపిఎం ధర్నా**




**భద్రాద్రి, కొత్తగూడెం ప్రతినిధి, మహా:** జిల్లాలో దాన్యం మొక్కజొన్న పంటల కొనుగోలులో జరుగుతున్న అవినీతి అక్రమాలను అరికట్టాలని సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.సోమవారం జిల్లా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలులో అధికారులు రైస్ మిల్లర్స్ ఏకమై రైతులకి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఆరు గాలం కష్టపడి పంటలు పండించి అమ్మే సమయంలో ప్రభుత్వం ఆరు రకాల టెస్ట్ లు నిర్వహించి వాటిలో పాస్ అయితే అప్పుడు కొనుగోలు చేస్తున్నారని దానివల్ల రైతులు ధాన్యం ప్రభుత్వం కొనలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. జిల్లాలో ఒక్క సుజాతనగర్ లోనే 12 టన్నుల ధాన్యం అమ్మకానికి రైతులు తీసుకొస్తే కేవలం 360 టన్నులు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసిందని ఆయన తెలిపారు. లేకుంటే తరుగుల పేరుతో ఐదు నుంచి పది కిలోలు ధాన్యం అదనంగా ఇస్తే కొంటామనీ రైస్ మిల్లు యజమానులు బాహటంగా చెబుతున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. రైతులు దిక్కులేని స్థితిలో ప్రైవేటు వ్యక్తులకు తక్కువ రేట్ కి అమ్ముకోవడం లేదంటే ఐదు నుంచి పది కేజీలు తరుగుతో రైస్ మిల్లుకు అమ్ముకోవడం జరుగుతుందని దీనికి కారణం ప్రభుత్వ అధికారులేనని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా మొక్కజొన్న జిల్లాలో ఎకరానికి 40 నుంచి 50 దిగుబడి అవుతుంటే కేవలం ఎకరానికి 26 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని కండిషన్ పెట్టడం సరైనది కాదని ఆయన అన్నారు. 24 వేల రూపాయలు క్వింటాకు మద్దతు ధర ప్రభుత్వం పేర్కొంటే కేవలం 1700 మాత్రమే చెల్లిస్తున్నారని ఇది రైతులని మోసం చేయడం తప్ప మరొటి కాదని అన్నారు. జిల్లాలో వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా ఉందని అధికారులు యొక్క కాలసత్వం వలన ప్రవేటు దళారులు విచ్చలవిడిగా రాజ్యం వెళుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ జిల్లాలో రైతాంగం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించటం లేదన్నారు. ఒకవైపు ధాన్యం మొక్కజొన్న కొనుగోలు జరుగుతున్న అక్రమాలను పట్టించుకోకపోగా ఈ జిల్లా ప్రాజెక్టుల పట్ల మంత్రులు ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తుందని ఆయన పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టుకి కేటాయించాల్సిన 8000 కోట్లు జిల్లా డిస్ట్రిబ్యూటర్ కెనాల్స్ కి కేటాయించాల్సిన 5000 కోట్లు తక్షణమే కేటాయించి పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. వలస ఆదివాసీల గ్రామాల్లో కనీస సౌకర్యాల కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. పట్టాలకి వారికి హక్కు కల్పించాలని అదేవిధంగా క్యాస్ట్ సర్టిఫికెట్స్ అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కారం పుల్లయ్య, లీక్కీ బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన వెంకటేశ్వర్లు, వీర్ల రమేష్, మొరంపుడి శ్రీనివాసరావు, వాంకుడోత్ కోబాల్, భూక్యా రమేష్, తులసి రామ్, దొడ్డ లక్ష్మీనారాయణ, నాగకృష్ణ, కాట్రాళ్ల తిరుపతిరావు, బొల్లి సత్యనారాయణ, కే.సత్య, వి.వాణి, నాగకృష్ణ, మాధవి, వినోద, సమ్మిరెడ్డి, భద్రయ్య, దేవా, ఉమేష్, సురేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# టిప్పర్ డీకొని...ఇరువురుకు తీవ్ర గాయాలు



**నేలకొండపల్లి, మహా :** రోడ్డు ప్రమాదంలో టిప్పర్ డీకొని ఇరువురు కు తీవ్ర గాయాలైన ఘటన మండలం లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని నాచేపల్లి కి చెందిన చిలకల లింగయ్య, సీతయ్య లు సోమవారం బైక్ పై నేలకొండపల్లి వెళ్తున్నారు. అదే సమయంలో నేలకొండపల్లి నుంచి నాచేపల్లి టిప్పర్ వస్తుంది. కొత్తూరు గ్రామ శివారు వద్ద కు రాగానే టిప్పర్ బైక్ ను డీకొట్టింది. దీంతో ఇరువురు కు తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికు లు ఇరువురు ను నేలకొండపల్లి ప్రభుత్వ హస్పిటల్ కు తరలించి ప్రధమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

- విద్యార్థులకు నాణ్యమైన విద్య మౌలిక వసతుల కల్పనే ప్రాధాన్యం
- విద్యా ప్రమాణాల మెరుగుదలకు అంకితభావంతో కృషి చేయాలి
- కళాశాల అభివృద్ధికి పూర్తి సహకారం ఉంటుంది
- శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నియోజకవర్గంలోనే ఒక ఆదర్శవంతమైన విద్యాసంస్థగా తీర్చిదిద్దాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం కొత్తగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉన్నత చదువులను చేరువ చేయడంలో ప్రభుత్వ కళాశాలల పాత్ర కీలకమని విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి లోటు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కళాశాలలో అకడమిక్ ప్రణాళికలు విద్యార్థుల హాజరు శాతం ల్యాబ్ లైబ్రరీ వసతులపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. అధ్యాపకులు కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గనిర్దేశకులుగా నిలవాలని కోరారు. కళాశాల భవన మరమ్మతులు అదనపు గదుల సిబ్బంది కొరత విద్యా పరికరాలు వంటి అంశాలను తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన విద్యా బోధనతో కళాశాల ప్రతిష్టను పెంచాలని ఆయన సిబ్బందికి సూచించారు.



# కార్యకర్తలే పార్టీకి ప్రాణం..
# క్షేత్రస్థాయిలో సీపీఐని బలోపేతం చేయాలి

- ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరుకు సిద్ధం కావాలి
- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భానుప్రసాద్ పిలుపు



**నేలకొండపల్లి, మహా :** పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమరోత్సాహంతో పని చేయాలని, ప్రజా సమస్యలపై ఎర్రజెండా అండగా నిలవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భానుప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం నేలకొండపల్లి మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవనం లో జిల్లా సమితి సభ్యులు కనకబండి సీతారాములు అధ్యక్షతన నిర్వహించిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల సామాన్యుడి బతుకు భారమైందని మండిపడ్డారు. పాలకుల వైఫల్యాలను ఎండగట్టడంలో కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. పార్టీని గ్రామ గ్రామాన పటిష్టం చేయాలని, ప్రజా ఉద్యమాలు ఉధృతం చేయాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.నిత్యావసర ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి అంశాలపై ప్రజలను చైతన్యపరిచి, వారి పక్షాన నిలబడి అధికారులను నిలదీయాలని పేర్కొన్నారు. శ్రమజీవుల హక్కుల కోసం, అణగారిన వర్గాల సంక్షేమం కోసం సీపీఐ ఎప్పుడూ ముందుంటుందని, రాబోయే రోజుల్లో పోరాట పంథాను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, జిల్లా సమితి సభ్యులు పొల్లెం శ్రీనివాసరావు, మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, మండల కార్యవర్గ సభ్యులు కర్నాటి నళిని రాణి, రాయల మాధవరావు, పాలపాటి అశోక్, మండల కౌన్సిల్ సభ్యులు బాలిన కృష్ణంరాజు, గూగులోతు వెంకటేశ్వరరావు, కాశబోయిన అయోధ్య, భూక్యా వెంకటేశ్వర్లు, అనంతు పుల్లయ్య, తేజావత్ రుప్లా తదితరులు పాల్గొన్నారు

# విద్యా వారోత్సవాలకు శ్రీకారం..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టర్ ఆవిష్కరణ..



**మణుగూరు, మహా :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలలో భాగంగా విద్యా వారోత్సవాల ప్రారంభం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యా వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దొడ్డి భద్రయ్య, సమితి సింగారం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, 5వ వార్డు సభ్యులు కొలపిని మానసలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని కొనియాడారు. ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక విద్య అందించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# అక్రమంగా జంతువులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

**ఎస్పీ రోహిత్ రాజు**




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా :** రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలను పటిష్టంగా అమలు చేయడంలో భాగంగా అక్రమంగా జంతువులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో అక్రమ జంతు రవాణాను అరికట్టడానికి పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపడుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా తనిఖీలను చేపట్టడం జరుగుతుందని వివరించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పశువుల సంతలు బక్రీద్ పండుగ దృష్ట్యా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల పనితీరు తదితర విషయాలపై అధికారులకు ఖచ్చితమైన ఆదేశాలను జారీ చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా చట్ట విరుద్ధంగా ఆవులు దూడలను అక్రమంగా రవాణా చేసి వధించడం పూర్తిగా నిషేధమని అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలు జిల్లాల నుండి జంతువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు 02 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, 03అంతర్ జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి మొత్తం 05 చెక్‌పోస్టుల వద్ద 24/7 నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి చెక్‌పోస్టులో పోలీస్ సిబ్బందితో పాటు పశుసంవర్ధక శాఖ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ వాహనాల తనిఖీలు కఠినంగా చేపడుతున్నట్లు వెల్లడించారు. జంతువుల రవాణా సమయంలో సంబంధిత చట్టాలు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా పశువులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి రాజీ ఉండదని హెచ్చరించారు. అలాగే అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని వ్యక్తిగత దాడులు గుంపులుగా దాడులు చేయడం కూడా శిక్షార్హమైన నేరాలని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి పశువుల అక్రమ రవాణా అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ముఖ్యంగా యువత ఆవేశానికి లోనవకుండా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని మత పెద్దలు యువతకు శాంతి సామరస్యాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి వాటిలో పశువుల అక్రమ రవాణాకు సంబంధించి విద్వేషాలను రెచ్చగొట్టేలా మార్ఫింగ్ ఫోటోలు, అసత్య ప్రచారాలు ప్రేరేపిత పోస్టులు పెట్టినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందుకోసం జిల్లా పోలీస్ మీడియా మానిటరింగ్ సెల్ నిరంతర నిఘా ఉంచిందని తెలిపారు. ప్రజల్లో భయాందోళనలు కలిగించే రూమర్లు వ్యాప్తి చేసిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ప్రతీ పండుగ సందర్భంగా ప్రజలు పరస్పరం మతాలను గౌరవించుకుంటూ శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు. జిల్లాలో శాంతి భద్రతలను కాపాడటానికి ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు

**పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్**




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమవారం వనమా కాలనీ, తెలంగాణ నగర్, వికలాంగుల కాలనీ, జయమ్మ కాలనీల్లోని ఇండ్లలో పాల్వంచ పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లుగా చెప్పారు. ఇందులో భాగంగా మొత్తం సుమారుగా 300లకు పైగా ఇండ్లలో సోదాలు నిర్వహించి సరిగా పత్రాలు, నంబర్ ప్లేట్స్ లేని 72 ద్విచక్ర వాహనాలను, 04 ఆటోలను సీజ్ చేయడం జరిగిందన్నారు. చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు. తమ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మట్కా, జూదం, కోడిపందాలు, బెట్టింగ్ గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల పై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడమైనదన్నారు. తమ కాలనీల్లోకి కొత్తగా ఎవరైనా వ్యక్తులు అద్దెకు వస్తే ఇంటి యజమానులు వారి ఆధార్ కార్డు, చిరునామాలను సేకరించి పెట్టుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేసారు. విపత్కర సమయాల్లో ఆపదలో ఉన్నప్పుడు డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీస్ వారి సేవలను పొందాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నేరాల నియంత్రణ కొరకు తమ నివాస ప్రాంతాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ ఇన్స్పెక్టర్ సతీష్, పాల్వంచ టౌన్ ఎస్సైలు నాగరాజు, జీవన్, కళ్యాణి, రూరల్ ఎస్సై సురేష్, ములకలపల్లి ఎస్సై మధు ప్రసాద్, బూర్గంపాడు ఎస్సై ప్రసాద్, స్టేషన్ల సిబ్బంది పాటు స్పెషల్ పార్టీ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

# పీవీ కాలనీలో నీటి ఎద్దడి..

- తక్షణమే నీటి సరఫరా పునరుద్ధరించాలి..
- లేనిపక్షంలో జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తాం..
- ఏఐటీయూసీ హెచ్చరిక



**మణుగూరు, మహా :** మణుగూరు ఏరియాలోని పీవీ కాలనీలో గత రెండు రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఏఐటీయూసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం బ్రాంచ్ కార్యదర్శి ఓ ప్రకటన విడుదల చేశారు. పవర్ సమస్య కారణంగా తాత్కాలిక అంతరాయం ఏర్పడిందని చెబుతున్నప్పటికీ, మోటార్లు చెడిపోయాయనే ప్రచారం సాగుతోందన్నారు. కాలనీలో నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకుని, కనీసం ఒకరోజుకు సరిపడా నీటిని నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాలని పలుమార్లు యాజమాన్యానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన వాటర్ ట్యాంకుల్లో నీటిని నిల్వ చేసి వినియోగించుకునే ముందుచూపు లేకపోవడం వల్లే ప్రస్తుతం ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. ఆదివారం సాయంత్రం రాత్రి 11 గంటలకు, తిరిగి ఈ సోమవారం సరఫరా పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు నీటి సరఫరా ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. ఎండాకాలం కావడంతో పెద్దలు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొంతమంది మంచినీటిని కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. తక్షణమే మంచినీటి సరఫరా పునరుద్ధరించాలని, అప్పటివరకు వాటర్ ట్యాంకర్ల ద్వారా తాత్కాలికంగా నీటిని అందించాలని ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచ్ డిమాండ్ చేసింది. సమస్య పరిష్కారం కాకపోతే మణుగూరు జీఎం కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించింది. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఏఐటిసి బ్రాంచ్ కమిటీ పిలుపునిచ్చింది. అలాగే పరిసర గ్రామ పంచాయతీల సర్పంచులు, సంబంధిత అధికారులు స్పందించి వాటర్ ట్యాంకర్ల ద్వారా పీవీ కాలనీకి తాగునీరు సరఫరా చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

**పంచాయతీ సెక్రెటరీకి ఏఐటియుసి వినతి..**

కూనవరం పంచాయతీ పరిధిలోని టీవీ కాలనీలో గత రెండు రోజులుగా నిలిచిపోయిన మంచినీటి సరఫరా విషయమై పంచాయతీ సెక్రటరీ ప్రసాద్ కు ఏఐటిసి నేతలు వినతి పత్రం అందజేశారు. తక్షణమే మంచినీటి సమస్య పరిష్కారానికి వాటర్ ట్యాంకర్ల ద్వారా కాలనీవాసులకు నీటిని సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో వారిలో ఏఐటియుసి నాయకులు ఆవుల నాగరాజు ఆధార్ల సురేందర్, సిపిఐ పంచాయతీ వార్డు మెంబర్లు లోకేష్, పద్మ, నాయకులు పాయం శ్రీను తదితరులు ఉన్నారు.

# బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్య వారోత్సవాలు



**బూర్గంపహాడ్ మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన విద్యా వారోత్సవాలు సందర్భంగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో IPFs/IDPs ప్యానెల్స్‌ను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ G. చీన్యా గారు ప్రారంభించారు. అనంతరం విద్యా ప్రచార కార్యక్రమానికి సంబంధించిన పాంప్లెట్లు, బ్రోచర్లు మరియు ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ శ్రీ G. చీన్యా గారు మాట్లాడుతూ, మార్చి-2026 ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఫలితాలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ స్థానం సాధించడం ఎంతో గర్వకారణమని తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన అధ్యాపకులను అభినందిస్తూ, విద్యార్థుల కృషి మరియు తల్లిదండ్రుల సహకారం కూడా కళాశాల విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. అలాగే కళాశాలలో విద్యార్థుల సమగ్రాభివృద్ధికి అనుకూలమైన వాతావరణం కల్పిస్తున్నామని తెలిపారు. విశాలమైన క్రీడా ప్రాంగణం, ఆధునిక వసతులతో కూడిన ప్రయోగశాలలు, గ్రంథాలయం విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అదనంగా, ITC సంస్థ అందించిన త్రాగునీటి ఫ్రిజ్ సహకారంతో విద్యార్థులకు స్వచ్ఛమైన చల్లటి త్రాగునీరు నిరంతరం అందిస్తున్నామని తెలిపారు. అలాగే విద్యార్థుల క్రమశిక్షణ, భద్రత మరియు మెరుగైన విద్యా వాతావరణం కోసం కళాశాలలో CCTVపర్యవేక్షణలో తరగతులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. Ch.నాగేశ్వరరావు గారు తెలుగు అధ్యాపకులు మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ డ్రైవ్‌ను మరింత ప్రభావవంతంగా నిర్వహించాలని సూచిస్తూ, కళాశాలలో ఉన్న విద్యా ప్రమాణాలు, సౌకర్యాలు గురించి గ్రామీణ స్థాయి వరకు విస్తృత ప్రచారం నిర్వహించి, అధిక సంఖ్యలో అడ్మిషన్‌లు సాధించి జిల్లా స్థాయిలో ముందువరుసలో నిలవాలని అధ్యాపకులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం,అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యా వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి





- పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- వేసవి శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్

**జూలూరుపాడు, మహా:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక - 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలు సోమవారం జిల్లాలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ అంకిత్ జూలూరుపాడు మండలంలో విస్తృతంగా పర్యటించి పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించడంతో పాటు పలు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. పడమట నర్సాపురం గ్రామపంచాయతీ పరిధి లోని దండు మిట్ట తండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సుమారు రూ.2 లక్షల వ్యయంతో చేపట్టనున్న బాలుర మరుగుదొడ్ల నిర్మాణ పనులకు స్థానిక సర్పంచ్ సంఘం లక్ష్మీ కుమారి, ఉప సర్పంచ్ ఆళ్ల ప్రవీణ్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా పలుగు పట్టి గుంత తవ్వి పనులను ప్రారంభించారు. పాఠశాలల్లో పరిశుభ్రత, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణంలో విద్య అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం పాపకొల్లు పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ అక్కడ చేపట్టనున్న ఇంకుడు గుంతల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు శిబిరాల్లో చురుకుగా పాల్గొంటూ కొత్త విషయాలు నేర్చుకోవాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి ఫలితాల్లో మండల స్థాయిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థిని పూజితను జిల్లా కలెక్టర్ అభినందించి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని అన్నారు. అనంతరం జూలూరుపాడు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, కళాశాలలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు వేసవి శిబిరంలో విద్యార్థులకు మ్యూజిక్, డాన్స్, పెయింటింగ్, కంప్యూటర్ స్కిల్స్, బేసిక్ కోడింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, స్పీడ్ మాథ్స్, క్రీడలు, యోగా తదితర అంశాల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. శిబిరంలో పాల్గొంటున్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడి వారికి అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వేసవి శిబిరంలో పాల్గొంటున్న విద్యార్థుల సంఖ్య, నిర్వహణ విధానం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని తమలోని సృజనాత్మకతను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యతో పాటు కళలు, క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలపై కూడా దృష్టి పెట్టాలని తెలిపారు. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల ప్రతిభా వికాసం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, విద్యా వారోత్సవాల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు, బోధనా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాలలో కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ అజయ్, ఎంఈఓ జుంకీలాల్, ఎంపీ ఓ తులసీరామ్ తోపాటు సర్పంచులు, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లు, ప్రధానోపాధ్యాయులు ఎస్కే మీరా సాహెబ్, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ కుమారుడిని వెంటనే అరెస్టు చేయాలి

**బీఆర్ఎస్ నాయకులు గిరిబాబు డిమాండ్**



**జూలూరుపాడు, మహా:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ పై నమోదైన పోక్సో కేసు వ్యవహారంలో ప్రభుత్వం, పోలీసుల తీరును వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు తీవ్రంగా తప్పుబట్టారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు యల్లంకి సత్యనారాయణ నివాసంలోని ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికార యంత్రాంగం పై నిప్పులు చెరిగారు. బీసీ వర్గానికి చెందిన ఒక బాలికను బండి భగీరథ మానసిక, లైంగిక వేధింపులకు గురిచేయడం అత్యంత దుర్మార్గమని అన్నారు. సామాన్యుడికి ఒక చట్టం, కేంద్ర మంత్రి కుమారుడికి మరో చట్టమా అని ప్రశ్నించారు. పోక్సో కేసు నమోదైనా ఇప్పటివరకు నిందితుడిని అరెస్టు చేయకపోవడం పోలీసుల వైఫల్యానికి పరాకాష్ట అని విమర్శించారు. బాధితురాలి తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురిచేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై కూడా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కొడుకు ఆచూకీ లేకపోయినా, ఫోన్ స్విచ్ఛాఫ్ ఉన్నా తండ్రిగా సంజయ్ కంగారు పడకుండా సభల్లో పాల్గొనడం చూస్తుంటే ఆయనే స్వయంగా నిందితుడిని తప్పించారనే అనుమానం కలుగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. పోక్సో కేసులో కఠినమైన సెక్షన్లు (57) పెట్టకుండా కేవలం 11వ సెక్షన్ పెట్టడం నిందితుడిని కాపాడే ప్రయత్నమేనని ఆరోపించారు. ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో బాధితులు ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరిస్తే తప్ప కేసు నమోదు చేయలేదని గుర్తుచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ, బీజేపీ నేతలకు దండిగా మద్దతు లభిస్తోందని, సీఎం రేవంత్ రెడ్డి, బీజేపీ మధ్య ఉన్న అపవిత్ర మైత్రి వల్లే అరెస్టులు జరగడం లేదని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి బండి భగీరథను అరెస్టు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలని, బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని లకావత్ గిరిబాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు దుద్దుకూరి నాగేశ్వరరావు, తాళ్లూరి రామారావు, సాయల నాగేశ్వరరావు, రాయపాటి వెంకటేశ్వర్లు, ఇల్లంగి తిరుపతి, పోతురాజు రామారావు, బుడిపూడి ప్రభాకర్, బుడిపూడి ప్రతాప్, గుండెపూడి ఉప సర్పంచ్ బాదావత్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ధ్వజస్తంభ, గ్రామదేవతల ప్రతిష్ట

**అన్నదానం ప్రారంభించిన నాయకులు**



కారేపల్లి, మహా : కారేపల్లి మండలం బీక్యాతండా లోని రామాలయం ధ్వజస్తంభం, గ్రామదేవతల ప్రతిష్ట ఉత్సవాలు గ్రామ పెద్దలు అజ్మీర బిచ్చ నాయక్, వాంకుడోత్ రాములు. అజ్మీర వీరన్న నాయక్ ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో గణపతి పూజ, చండీ రుద్రహోమాలు, మహాలక్ష్మి హోమాలు, సహస్ర కుంకుమార్చన జలాధివాస, క్షీరాదివాస, ధాన్యాదివాస, పుష్పాదివాస, సయ్యాధివాసా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు బి వాసుదేవ శర్మ, బి.భరద్వాజ శర్మ, ఎన్.నాగేంద్రశర్మ, రోహిత్‌శర్మల తోపాటు పలువురు పూజారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ట అనంతరం పూర్ణాహుతి కార్యక్రమంతో ఉత్సవాలు ముగిశాయి. ఆలయ ప్రాంగణంలో కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా ప్రారంభించారు.

# మంచి నీళ్ల కోసం - జీఎం ఆఫీస్ ముందు ఏఐటీయూసీ ధర్నా..

**మణుగూరు, మహా :** పీవీ కాలనీకి గత రెండు రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సాయంత్రం జీఎం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిన్నటి నుంచి డీజీఎం పర్సనల్, సివిల్ విభాగం, ఏరియా వర్క్‌షాప్ అధికారులతో పలుమార్లు నీటి సరఫరాపై చర్చించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. గతంలో నీటి సమస్యలు వచ్చిన సందర్భాల్లో పీవీ కాలనీలో స్టోరేజ్ ట్యాంకుల్లో కనీసం ఒక రోజు సరిపడా నీటిని నిల్వ ఉంచాలని ఏఐటీయూసీ యూనియన్ సూచించినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. తీవ్ర వేసవి కారణంగా పిల్లలు, మహిళలు, వృద్ధులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల వరకు కూడా నీటి సరఫరా జరగకపోవడంతో, యాజమాన్యం తక్షణమే చర్యలు తీసుకుని మంచి నీళ్లు అందించాలని డిమాండ్ చేస్తూ జీఎం కార్యాలయం ముందు ధర్నా చేపట్టామన్నారు.

## యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘనంగా ప్రారంభమైన విద్యా వారోత్సవాలు




**యాదాద్రి భువనగిరి, మహా:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. సోమవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యా వారోత్సవాలు యాదాద్రి భువనగిరి జిల్లాలో ఈరోజు ఘనంగా ప్రారంభించారుఈరోజు అనేక పాఠశాలలలో నూతన తరగతి గదులు, టాయిలెట్లు,వంటగదులు మొదలగు ప్రారంభోత్సవాలు,శంకుస్థాపనలు మరియు విద్యార్థులకు వేసవి శిబిరాలు ప్రారంభించారుఇందులో భాగంగా పీఎం జడ్పీహెచ్ఎస్ రాజాపేట పాఠశాలలో ప్రభుత్వవిప్ మరియు ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అదనపు తరగతి గదులు మరియు సైన్స్ ల్యాబ్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు , జిల్లా విద్యాధికారి సత్యనారాయణ , విద్యాశాఖ మౌలిక వసతులు ఇంజనీరింగ్ విభాగము డి.ఈ.శివ కుమార్ , రాజాపేట మండల విద్యాధికారి చందా రమేష్ పాల్గొన్నారు. జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో, కేజీబీవీ వలిగొండ, తుర్కపల్లి, బొమ్మలరామారం, పోచంపల్లి మరియు భువనగిరి మండలాలలో నాబార్డ్ ద్వారా మంజూరు చేయబడిన అనేక అభివృద్ధి పనులు ఆయా గ్రామాల సర్పంచులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారుమహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న బాలురు బాలికల టాయిలెట్లు మూత్రశాలలు మరియు వంట గదిలో అనేక పాఠశాలలలో పనులు ప్రారంభించడం జరిగినది. భువనగిరి మండలం ఆకుతోట బావి తండా నందు మండల విద్యాధికారి నాగవర్ధన్ రెడ్డి , జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీహరి అయ్యంగార్ గ్రామ సర్పంచ్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.తుర్కపల్లి మండలం బచ్చలిగూడ ప్రాథమిక పాఠశాల లో నూతన టాయిలెట్, వంటగది చౌటుప్పల్ మండల్ కుంట్ల గూడెం ఉన్నత పాఠశాలలో వంటగది, నారాయణపురం మండలం గుజ్జ మరియు కంకణాల గూడెం పాఠశాలలో, రామన్నపేట మండలం బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో, అడ్డగూడూరు మండలం రేపాక (డి) పాఠశాల నందు టాయిలెట్లు మరియు వంట గదులు ఆయా మండల విద్యాధికారులు మరియు సర్పంచ్ ల ద్వారా ప్రారంభించడం జరిగింది.జిల్లాలోని 17 పి.ఎం.శ్రీ ఉన్నత పాఠశాలల్లో వేసవి శిబిరాలు ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, సెక్టోరియల్ అధికారులు మరియు ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జనగణన పకడ్బందీగా నిర్వహించాలి


**అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**



**యాదాద్రి భువనగిరి, మహా:** జనగణన-2027 తొలి దశలో భాగంగా నిర్వహిస్తున్న ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధికారులకు సూచించారు. సోమవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న హౌస్ లిస్టింగ్ గణన ప్రక్రియను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ హౌస్ లిస్టింగ్ ఆపరేషన్‌లో ప్రతి ఇంటిని తప్పనిసరిగా కవర్ చేయాలని పేర్కొన్నారు. ఏ ఒక్క కుటుంబం లేదా గృహం గణనలో వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు.ప్రతి ఎన్యూమరేటర్ తనకు కేటాయించిన పరిధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ అవసరమైన సమాచారాన్ని సేకరించాలని సూచించారు. గణనలో నమోదు చేసే వివరాలు భవిష్యత్తు ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు.అధికారులు సమన్వయంతో పనిచేసి గణన ప్రక్రియను సమయానికి పూర్తి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆలేరు ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

**ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు జర్నలిస్టుల విజ్ఞప్తి**



**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ కేంద్రమైన ఆలేరు పట్టణంలో ప్రెస్ క్లబ్ నిర్మాణానికి స్థలం కేటాయించి భవననిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు సోమవారం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు వినతి పత్రం అందించారు...జర్నలిస్టులతో ఎమ్మెల్యే ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అలాగే జర్నలిస్టులందరి ఇండ్ల స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయాలని కోరగా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.బీర్ల ఫౌండేషన్ నుండి జర్నలిస్టు కుటుంబాలకు ప్రమాద భీమ గ్రూప్ ఇన్సూరెన్స్ చెపిస్తానన్నారు. జర్నలిస్టు సంక్షేమమే సిఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని జర్నలిస్టులందరి అండగా వుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగామ ఉపేందర్ రెడ్డి, మాజీ ఎంపిపి గందమల్ల అశోక్, పిఎసిఎస్ డైరెక్టర్ కట్టెగొమ్ముల సాగర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వర రాజు,పట్టణ అధ్యక్షుడు ఎంఏ ఏజాజ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ చట్ట రక్షణ కోసం ఈ నెల 15న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నగ్రామీణ సమ్మెకు సహకరించండి

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం**

**యాదాద్రి భువనగిరి, మహా:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన విబి జి రాంజీ చట్టాన్ని రద్దుచేసి పాత చట్టాన్ని కొనసాగించాలని, ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మే 15న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామీణ సమ్మె (బంద్) కార్యక్రమానికి సహకరించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి టి. నాగిరెడ్డికి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "సమ్మె" నోటీసును సంఘం జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శి బొల్లు యాదగిరి, కొండమడుగు నర్సింహ, జిల్లా ఉపాధ్యక్షులు, చీమల కొండూరు సర్పంచ్ పల్లెర్ల అంజయ్యలు అందించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామీణ సంపదలో కీలక పాత్ర పోషిస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్న ఉపాధి హామీ కార్మికులు మోడీ తీసుకొచ్చిన జిరాంజి చట్టం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వెలిబుచ్చారు. కొత్తకొత్త జీవోలతో గత చట్టంలో ఉన్న అనేక హక్కులను కూడా తొలగించారని అన్నారు. ఉపాధి కార్మికుల సమస్యలు అన్ని ఇన్ని కావని పనికి పోతే ఎంత కూలి వస్తుందో కూడా తెలియని పరిస్థితిలో ఉన్నారని, చేసిన పనికి ఎప్పుడు డబ్బులు వస్తాయో కూడా తెలియక తమ కుటుంబాల పోషణ భారంగా మారిందని అన్నారు. ఇప్పటికైనా ఉపాధి హామీలో పనిచేస్తున్న కార్మికులతో పాటు సిబ్బందికి సంబంధించిన పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఉపాధి హామీలో పనిచేస్తున్న కార్మికులకు సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించి రోజు కూలీ 800 ఇవ్వాలని, రోజుకు రెండుసార్లు ఫోటోలు తీసి ఈ కేవైసీ విధానాన్ని రద్దుచేయాలని, పని ప్రదేశంలో తాగడానికి మంచి నీళ్లు, నీడ కోసము టెంటు, మెడికల్ కిట్టు లాంటి సౌకర్యాలు కల్పించాలని, విబి జి రాంజీ చట్టాన్ని రద్దుచేసి , పాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, పని ప్రదేశంలో ప్రమాదాలు జరిగితే ఉచిత వైద్యం అందించాలని, కార్మికులందరికి బీమా సౌకర్యం కల్పించాలని, కూలీలకు పారా, తట్ట, గడ్డపార, గొడ్డలి వంటి పనిముట్లు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వము 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వము 40 శాతం నిధులు ఇవ్వాలని తెచ్చిన జీవోలు రద్దుచేసి కేంద్ర ప్రభుత్వమే 90% నిధులు కేటాయించాలని, పట్టణాల్లో కూడా ఉపాధి హామీ పనులను కల్పించి పేదలకు ఉపాధి కల్పించాలనే డిమాండ్స్ సాధన కోసం ఈ నెల 15న నిర్వహిస్తున్న గ్రామీణ సమ్మెలో ఉపాధి హామీ కార్మికులు లక్షలాదిగా పని బంద్ చేసి పాల్గొనాలని కోరారు.



## వందల కోట్ల అప్పుల పాలైపోతున్న దేశం

**దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుంది.. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కొడుకును అరెస్టు చేయాలి**


**వలిగొండ: మహా:** వలిగొండ పట్టణ కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మండల బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు కూచిమల్ల సుధాకర్ మాట్లాడుతూ, బంగారం కొనొద్దు , పెట్రోల్ ,డీజిల్ కోసం ప్రజలు తిరిగొద్దని నిన్న సభలో ప్రధాని మోదీ అనడం భారతదేశానికి స్వతంత్రం వచ్చి 80 సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటి వరకు ఏ ప్రధానమంత్రి కూడా ఇలాంటి ఆంక్షలు పెట్టలేదని అన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కొడుకును ఫోక్సో కేసు విషయంలో వెంటనే అరెస్టు చేసి రిమాండ్ కు తరలించాలని ఆయన డిమాండ్ చేశారు ధరలు పెరగడానికి కారణం రూపాయి విలువ పతనమే కారణం కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వమే మోదీ ప్రధాని అయ్యాక ఎగుమతులు తగ్గి దిగుమతులు పెరిగాయి ఎగుమతులు చేసుకునే మొక్కజొన్న మరియు కాటన్ కూడా దిగుమతి చేసుకునే పరిస్తితి వచ్చింది దానికి కారణం కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కాదా? అని ఆయన విమర్శించారు. విదేశీ మాదకద్రవ్యం బాగా తగ్గిపోవడం వల్ల 95 రూపాయలు ఖర్చు పెట్టిన ఒక డాలర్ రావడం లేదు. డాలర్ విలువ పెరిగిపోవడం వల్ల రూపాయి విలువ పతనం అయ్యి దేశ ఆర్థిక వ్యవస్త క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. దానికి కారణం కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కాదా? దీనికి నరేంద్ర మోదీ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలి అన్నారుగడిచిన 12 సంవత్సరాల కాలంలో రెండు వందల లక్షల కోట్లు అప్పు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కాదా రెండు లక్షల కోట్ల అప్పు ఏ అభివృద్ధి కార్యక్రమానికి వినియోగించారు, ఏ ఒక్క ప్రాజెక్టును కట్టారు ప్రజలకు మోడీ సమాధానం చెప్పాలి అబద్ధపు అసత్యపు హామీలతో అధికారం చేపట్టిన నరేంద్ర మోడీ ప్రభుత్వం కుబేరుల నల్లధనాన్ని స్విస్ బ్యాంకుల నుండి వెనక్కి తీసుకువచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో 15 లక్షలు జమ చేస్తామని చెప్పి ఇప్పటివరకు ఎన్ని కోట్ల మంది ఖాతాలో 15 లక్షల జమ చేశారో భారతదేశ ప్రజలకు నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలన్నారు పక్క దేశం చైనా ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైన రెండున్నర సంవత్సరాల గాను పెట్రోల్ డీజిల్ గ్యాస్ లను నిలువ చేసుకునే సామర్థ్యం చైనాకు ఉంది కానీ మనదేశంలో నరేంద్ర మోడీ అనాలోచితమైన విధానాల వలన ప్రణాళికలు లేకపోవడం వలన రెండు నెలలకు సరిపడే పెట్రోల్ డీజిల్ నిల్వలు లేకపోవడం చాలా బాధాకరమని టెక్నాలజీలో చాలా వెనుకబాటులో ఉన్నాము భారతదేశంలో బిజెపి పార్టీ మతపరమైన రాజకీయాలు చేస్తూ లబ్ధి లబ్ధి పొందుతుంది భారతదేశ ప్రజల అభివృద్ధి సంక్షేమాన్ని గాలికి వదిలేసినరేంద్రమోడీ ,రేవంత్ రెడ్డి ల దోస్తానా ఏందో చెప్పాలిలేక కాంగ్రెస్ బిజెపి రెండు పార్టీలు ఒకటెన. అని ప్రశ్నించారు బడే బాయ్ చోట బాయ్ దోస్తానా నరేంద్ర మోడీ రాకతో తేటతెల్లమైందని తెలిపారు. రాబోయే రోజులలో తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేసిన మోసం చేస్తున్న కాంగ్రెస్ బిజెపి పార్టీలను తెలంగాణ ప్రజలు బొంద పెట్టడం ఖాయమన్నారు.






## ఎర్రమందారంగా డస్కీ బ్యూటీ డింపుల్

ఈ ఏడాది ఇప్పటికే రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చిన శర్వానంద్.. త్వరలో 'భోగి'తో రాబోతున్నాడు. విలేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దీన్ని తెరకెక్కిస్తున్నారు. సంపత్ నంది దర్శకుడు. ఆగస్టు 28న థియేటర్లలోకి రాబోతున్న ఈ చిత్రం నుంచి ఇప్పుడు డింపుల్ హయాతి ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఇప్పటికే హీరోహీరోయిన్లు అయిన శర్వానంద్, అనుపమ పరమేశ్వరన్ లుక్స్ రిలీజ్ చేశారు. తాజాగా మందారం అనే పాత్రలో డింపుల్ హయాతి లుక్ రిలీజ్ చేశారు. ఇందులో ఎర్రచీరలో డిఫరెంట్‌గా కనిపించింది. ఈ ఏడాది సంక్రాంతికి 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'లో ఓ హీరోయిన్‌గా చేసినప్పటికీ హిట్ అయితే దక్కలేదు. కెరీర్ ప్రారంభం నుంచి హీరోయిన్‌గా పలు సినిమాలు చేస్తున్న డింపుల్ హయాతికి సరైన సక్సెస్ రావట్లేదు. మరి 'భోగి'లో మందారం పాత్ర అయినా దాన్ని తీసుకొస్తుందేమో చూడాలి?



## ఆరు నెలలు నరకం చూశా..

**కంట్రోల్ చేసుకోలేక ఏడ్చేదాన్ని: కియారా అద్వానీ**

తల్లి అయిన తర్వాత తన జీవితం పూర్తిగా మారిపోయింది అంటుంది బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ. తాజాగా ఆమె ప్రముఖ పాడ్‌కాస్ట్ హోస్ట్ రాజ్ షమానికి ఇంటర్వ్యూ ఇచ్చింది. ఈ సందర్భంగా పోస్ట్‌పార్టమ్ (ప్రసవం తర్వాత తల్లి శరీరం, మానసిక స్థితిలో వచ్చే మార్పు) గురించి మాట్లాడుతూ.. ఎమోషనల్ అయింది. 'పాప పుట్టిన తర్వాత మొదటి ఆరు నెలలు నరకం చూశా. నాపై నాకే జాలి చూపించుకోవడం కష్టంగా అనిపించింది. చిన్న చిన్న విషయాలకే ఏడ్చేదాన్ని. నా భావోద్వేగాలను కంట్రోల్ చేసుకోలేకపోయేదాన్ని. నా మనసులోని భావాలను స్పష్టంగా అర్థం చేసుకోవడానికి, వాటికి ప్రాధాన్యత ఇవ్వడానికి సుమారు ఆరు నెలల సమయం పట్టింది. ఇంతకాలం కుటుంబం, పని, ఇతరుల గురించి మాత్రమే ఆలోచించిన నేను.. నా కోసం కూడా సమయం కేటాయించుకోవాల్సిన అవసరం ఉందన్న విషయం మాతృత్వం నేర్పింది. ఈ కష్ట సమయంలో నా భర్త సిద్ధార్థ్ మల్హోత్రా చాలా సపోర్ట్ చేశాడు. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా.. ప్రతి రోజు రాత్రి నా దగ్గరకే వచ్చేవాడు. డ్రైవ్‌కి తీసుకెళ్లేవాడు. ఆ చిన్న డ్రైవ్స్ కూడా నాకు ఎంతో మానసిక ప్రశాంతతను కలిగించేవి' అంటూ కియారా ఎమోషనల్ అయింది. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. కాగా, కియారా, సిద్ధార్థ్‌లది ప్రేమ వివాహం. 2023లో వీరి పెళ్లి జరిగింది. 2025 జులైలో కుమార్తె జన్మించింది. కెరీర్ విషయానికొస్తే.. పెళ్లి తర్వాత కూడా కియారా సినిమాలతో బిజీ అయిపోయింది. ఆమె నటించిన టాక్సిక్ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది.



## ఒక్క సినిమాకు రూ.200 కోట్లు..

**మరి సీఎంగా వచ్చే జీతమెంత?**

సినిమాల్లో సక్సెస్ అయిన హీరో విజయ్.. రాజకీయాల్లోనూ తన మార్క్ చూపించారు. పోటీ చేసిన తొలిసారే ఏకంగా సీఎం అయ్యారు. తమిళనాడు ఎన్నికల్లో మెజార్టీ మార్క్ రాకపోయినా.. ఇతర పార్టీల మద్దతుతో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికలకు ముందు ఆయన నటించిన చివరి సినిమా జన నాయగన్. ఈ చిత్రం సెన్సార్ వివాదాలతో రిలీజ్ కాలేదు. ఈ మూవీకి దళపతి ఏకంగా రూ.200 కోట్ల వరకు రెమ్యునరేషన్ తీసుకున్నారని టాక్ వినిపించింది. కానీ ఇప్పుడు విజయ్ హీరో కాదు.. ఓ రాష్ట్రానికి ముఖ్యమంత్రి. ఒక్క సినిమాకు రూ.200 కోట్లు తీసుకునే విజయ్.. సీఎంగా ఎంత సంపాదిస్తారనే దానిపై ప్రతి ఒక్కరిలో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే ప్రజల సొమ్మును తాను తినని స్పష్టం చేసిన విజయ్.. సీఎంగా తనకొచ్చే నెల జీతంతోనే సర్దుకుపోతారా? అనేది ఇప్పుడు హాట్ టాపిక్. తమిళనాడు ముఖ్యమంత్రిగా సీఎం విజయ్‌కి నెలకు రూ.2,05,000 జీతం అందుకోనున్నారు. సినిమాల్లో ఒక్క సినిమాకే కోట్ల రూపాయలు ఆదాయం వచ్చే విజయ్.. ఇకపై ఏడాది కేవలం రూ. 34.2 లక్షల జీతం మాత్రమే ఆయనకు దక్కనుంది. అయితే వీటితో పాటు ప్రభుత్వ క్యాంప్ ఆఫీస్, జెడ్ ప్లస్ సెక్యూరిటీ వంటి ప్రత్యేక సౌకర్యాలు కూడా అందుబాటులో ఉంటాయి. ప్రజాక్షేత్రంలో అడుగుపెట్టిన విజయ్.. ఇప్పటికే సినిమాలు చేయనని చెప్పేశారు. తన చివరి మూవీ జన నాయగన్ అని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.


EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com